గురువారం

10-11-2022

విజయవాడ ప్రచురణ

సంపుటి : 71, సంచిక : 138

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

చరిత్ర సృష్టించిన తెలుగు మహిళ

మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా తొలిసారి భారత సంతతికి చెందిన మహిళ ఎన్నికై చరిత్ర సృష్టించారు. మేరీల్యాండ్ గవర్నర్‌గా వెస్ మూర్ విజయం సాధించారు. వెస్‌మూర్, అరుణ మిల్లర్లు డెమొక్రాట్ల అభ్యర్థులు.

2లో

భద్రతా వలయంలో విశాఖ

- మోదీ కాన్వాయ్‌కి ప్రత్యేక పోలీసు దళం
- ఢిల్లీ నుంచి 50 మంది అధికారుల రాక
- చోళా సూట్, ఎయిర్‌పోర్ట్, ఏయూ వద్ద స్పెషల్ ఫోర్స్
- వారం రోజులు చిరు వ్యాపారాలు బంద్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజులపాటు విశాఖ నగరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొననుండడంతో మహానగరం ఎస్పీజీ (స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు) పోలీసుల భద్రతా వలయంలోకి వెళ్లిపోయింది. అంతర్జాతీయ విమానాశ్రయం, నేవీ పరిధిలోని చోళాసూట్, ఏయూ గ్రౌండ్స్ ప్రాంతాలన్నీ ప్రత్యేక అధికారులు తమ చేతుల్లోకి తీసుకున్నారు. మరోపక్క దాదాపు ఐదువేల మందికి పైగా పోలీసులు నగరాన్ని చుట్టుముట్టారు. అన్ని దారులు పోలీసుల వలయంలో చిక్కుకున్నాయి. మోదీ పర్యటన ఈ నెల 11,12 తేదీల్లో విశాఖలో ఉండడంతో ఢిల్లీ నుంచి ప్రత్యేక బలగాలు నగరానికి చేరుకున్నాయి. 50 మంది ప్రత్యేక అధికారులు రానున్నారు. మోదీ కాన్వాయ్‌కు మరో ప్రత్యేక దళం రానుంది. ప్రధానంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిరసన సెగ ప్రధానికి తగలకుండా ఉండాలనే లక్ష్యంతోనే భారీ భద్రత చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. స్టీల్ ప్లాంట్ జంక్షన్ నుంచి నగరంలో ప్రతి కూడలి వద్ద వందలాది మంది పోలీసులు ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేశారు. మూడు రోజుల ముందునుంచే బందోబస్తు నిర్వహణలో పోలీసులు తనమునకలై ఉన్నారు.

మధురవాడ, పెందుర్తి, రహదారుల మీదుగా వచ్చే ప్రతి ఒక్కరిని తనిఖీ చేస్తున్నారు. దీంతో సాధారణ జనజీవనానికి తీవ్రతరాయం ఏర్పడింది. విద్యార్థులు, ఉద్యోగులు, పర్యాటకులకు పోలీస్ ఆంక్షలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మరోపక్క రోడ్లపై చిరు వ్యాపారాలను పోలీసులు బంద్ చేశారు. కాన్వాయ్ రహదారి గుండా ఇరువైపులా ఉన్న షాపులను మూయించేశారు. అటు బీచ్ రోడ్ లో, ఇటు నగరంలో అనేక కూడళ్లలో

- మిగతా 2 లో

ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక పాదయాత్రపై

పోలీసు కర్కశం

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ... అఖిలపక్ష ఉక్కు పోరాట కమిటీ చేపట్టిన ఉద్యమం ఉధృతరూపం దాల్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ రానున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ... వందలాదిమంది ఉక్కు కర్మాగారం కార్మికులు, ఉద్యోగులు విశాఖలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అయితే ప్రదర్శనను మధ్యలోనే పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది.

ప్రదర్శకులపై లాఠీలు ఝుళిపించిన వైనం

- అనేకమందికి గాయాలు
- కార్మిక నాయకుల అరెస్టు
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించాల్సిందే
- అఖిలపక్ష ఉక్కు పోరాట కమిటీ నేతల డిమాండ్
- ప్రధానికి నిరసన సెగ తప్పదని స్పష్టీకరణ

2లో

- బీజేపీయేతర పార్టీలు భాగస్వాములు కావాలి
- ఏం చేశారని జగన్ స్వాగత ఏర్పాట్లు ?
- విశాఖలో కార్మికుల అరెస్టులకు వామపక్షాల ఖండన

మోదీ అన్యాయాన్ని ఎండగడుతూ..

రేపు, ఎల్లుండి నిరసనలు

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పదేపదే చేస్తున్న అన్యాయానికి నిరసనగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నల్ల జెండాలు, బ్యాడ్జీలతో నిరసన చేపట్టాలని వామపక్ష పార్టీలు నిర్ణయించినట్లు సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు వెల్లడించారు.

3లో

గవర్నర్లపై రణభేరి

- రాజ్యాంగ విరుద్ధ చర్యలను ప్రశ్నిస్తున్న రాష్ట్రాలు
- వర్సిటీల ఛాన్సలర్‌గా గవర్నర్‌ను తొలగిస్తూ ఆర్డినెన్స్ : కేరళ నిర్ణయం
- గవర్నర్ రవిపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన తమిళనాడు
- తమిళి సైతో తెలంగాణ అమీతుమీ

తిరువనంతపురం/చెన్నై/హైదరాబాద్ :

దేశంలో గవర్నర్ల వ్యవస్థ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కేంద్రంలోని కాషాయ ప్రభుత్వం నియమించిన గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరుపై కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వారి రాజ్యాంగ విరుద్ధ చర్యలను ప్రశ్నిస్తున్నాయి. మూడు రాష్ట్రాల్లోని గవర్నర్లు కీలకమైన చట్టాల విషయంలో 'కేంద్రం కీలుబొమ్మలా' వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. ఆయా గవర్నర్లతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. కేరళలో ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. గవర్నర్‌కు అధికారాలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక చర్యకు ఉపక్రమించింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల కులపతిగా గవర్నర్‌ను తొలగించి, ప్రముఖ విద్యావేత్తలను ఆ పదవిలో నియమించాలని కేరళ ప్రభుత్వం బుధవారం నిర్ణయించింది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో ఉప కులపతుల నియామకంతో సహా విశ్వవిద్యాలయాల పనితీరుపై గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌తో కొనసాగుతున్న ఘర్షణ మధ్య ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాలకు గవర్నర్ కూడా సారథ్యం వహించాలనే అధికారాన్ని తొలగించి, ఛాన్సలర్ నియామకానికి సంబంధించి విశ్వవిద్యాలయ చట్టాలను సవరించే ఆర్డినెన్స్‌ను ప్రకటించాలని మంత్రివర్గ సమావేశంలో ఖాన్‌కు సిఫార్సు చేయాలని నిర్ణయించినట్లు సీఎంవో ప్రకటన తెలిపింది. ఈ సమావేశంలో భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి మదన్ మోహన్ పుంఛీ నేతృత్వంలోని పుంఛీ కమిషన్ సిఫార్సులను కూడా కేబినెట్ పరిగణనలోకి తీసుకుందని, గవర్నర్‌కు రాజ్యాంగం ప్రకారం ఇతర విధులు కూడా ఉన్నందున విశ్వవిద్యాలయాల కులపతిగా నియమించడం సరికాదని ఆయన

- మిగతా 2 లో

ఐదుగురు విద్యార్థుల

అదృశ్యం

- తల్లిదండ్రుల ఆందోళన
- ప్రత్యేక పోలీసు బృందం గాలింపు

విశాలాంధ్ర-తిరుపతి క్రైమ్ :

స్థానిక నెహ్రూనగర్‌లోని అన్నమయ్య మీడియం స్కూల్ విద్యార్థులు ఐదుగురు బుధవారం ఉదయం అదృశ్యమైన సంఘటన నగరంలో సంచలనం కలిగించింది. ఉదయం 8.30 గంటల సమయంలో పదో తరగతి చదువుతున్న మోహత, మౌన, గున, అబ్దుల్ రెహమాన్, తొమ్మిదో తరగతి చదువుతున్న అతిఫ్ ట్యూషన్‌కు వచ్చి ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. వెంటనే ట్యూషన్ దగ్గరకు వెళ్లి అడగ్గా విద్యార్థులు ఇంటికే బయలుదేరారని చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల వెదికినా పిల్లలు కనబడకపోవడంతో కంగారుపడ్డారు. వెంటనే వెస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విద్యార్థులు

- మిగతా 2 లో

సీజేఐగా జస్టిస్ చంద్రచూడ్ ప్రమాణం

న్యూఢిల్లీ:

జస్టిస్ ధనంజయ్ యశ్వంత్ (డీవై) చంద్రచూడ్ భారత 50వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం రాష్ట్రపతి భవన్‌లో ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. సీజేఐగా జస్టిస్ చంద్రచూడ్ పదవీ కాలం రెండేళ్ల పాటు అంటే 2024, నవంబరు 10 వరకు ఉంటుంది. దేశానికి సేవ చేయడానికి ప్రాధాన్యత ఇస్తానని, సాంకేతిక పరిజ్ఞానం లేదా రిజిస్ట్రీ/న్యాయ సంస్కరణలకు సంబంధించి పౌరుల రక్షణకు కట్టుబడతానని కొత్త సీజేఐగా ప్రమాణం చేసిన జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. అనంతరం పార్లమెంటు ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ సుదీర్ఘకాలం (1978 ఫిబ్రవరి 22 నుంచి 1985 జులై 11 వరకు) సీజేఐగా విధులు నిర్వర్తించిన జస్టిస్ వైవీ చంద్రచూడ్ కుమారుడు. 2016, మే 13న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1959, నవంబరు 11న జస్టిస్ చంద్రచూడ్ జన్మించారు. ఈయన విద్యాభ్యాసం ఢిల్లీ యూనివర్సిటీలో, సెయింట్ స్టీఫెన్ కాలేజీలో జరిగింది. హార్వర్డ్‌లోని క్యాంపస్ లా సెంటర్ నుంచి పట్టా పొందారు. 2002, మార్చి 29న బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

2013, అక్టోబరు 13 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియామకం పొందే వరకు అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. జస్టిస్ చంద్రచూడ్ చరిత్రాత్మక తీర్పులు వెలువరించిన సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనాల్లో భాగంగా ఉండి అయోధ్య, గోప్యత హక్కు, వ్యభిచారం, ఆధార్ చట్టబద్ధత, శబరిమల వివాదం, అవివాహిత మహిళకు గర్భవిచ్ఛిత్తి హక్కు, మహిళలపై లింగవివక్ష వంటి వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించారు. కాగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు 65ఏళ్లు. సీజేఐగా జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ పదవీ విమరణ పొందిన క్రమంలో కొత్త సీజేఐగా జస్టిస్ చంద్రచూడ్ బాధ్యతలు చేపట్టారు.

నేపాల్‌లో భూకంపం

ఆరుగురి మృతి

ఐదుగురికి గాయాలు

2లో

ఇదీ లోకం!

ఎందుకు వర్రీ, ఇప్పటినుంచే కొత్త పార్టీ వెతుక్కోండి మీకు అలవాటే కదా!

నీట్-పీజీ 2023 ఇదే చివరి పరీక్ష!

నేషనల్ ఎగ్జిట్ టెస్ట్‌తో భర్తీకి యోచన

న్యూఢిల్లీ :

పీజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు వచ్చే ఏడాది ఏప్రిల్-మేలో జరగనున్న జాతీయ అర్హత-ప్రవేశ పరీక్ష-పోస్ట్ గ్రాడ్యుయేట్ (నీట్-పీజీ) చివరి పరీక్ష కావచ్చని అధికారులు తెలిపారు. ఆ తర్వాత చివరి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు తుదిగా తీసుకోబోయే నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్ట్) ఫలితాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. సోమవారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) డిసెంబర్ 2023లో నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ నిర్వహించాలని భావిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు తెలియజేసినట్లు అధికారిక వర్గాలు బుధవారం తెలిపాయి. డిసెంబర్ 2023లో నిర్వహిస్తే, 2019-2020 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలి. పరీక్ష ఫలితాలు 2024-2025 బ్యాచ్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సుల్లో ప్రవేశానికి కూడా ఉపయోగించబడతాయని వారు తెలిపారు. ఎన్ఎంసీ చట్టం ప్రకారం, నెక్స్ట్ అనేది ఎంబీబీఎస్ చివరి సంవత్సరం సాధారణ అర్హత పరీక్షగా ఉంటుంది. ఆధునిక వైద్యాన్ని అభ్యసించడానికి, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రతిభ ఆధారిత ప్రవేశానికి, భారతదేశంలో ప్రాక్టీస్ చేయాలనుకునే విదేశీ వైద్య గ్రాడ్యుయేట్లకు స్క్రీనింగ్ పరీక్షగా లైసెన్సియేట్ పరీక్షగా పనిచేస్తుంది. కాగా సెప్టెంబర్ 2024 వరకు నెక్స్ట్ నిర్వహించడానికి కాల

- మిగతా 2 లో

శతాధిక ఓటర్లు 2.50 లక్షల మంది

- పట్టణ ఓటర్లలో ఉదాసీనత
- ఓటింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి
- సీఈసీ రాజీవ్ కుమార్

పూణె:

భారతదేశంలో 100 ఏళ్లు పైబడిన ఓటర్లు 2.49 లక్షల మంది ఉన్నారని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ బుధవారం తెలిపారు. అంతేకాకుండా, 1.80 కోట్ల మంది ఓటర్లు 80 ఏళ్లు పైబడిన వారని అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సారాంశ సవరణ జాతీయ స్థాయి ప్రారంభంలో భాగంగా ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు బుధవారం మహారాష్ట్రలోని పూణెలోని బలేవాడి ప్రాంతంలోని శివ్ ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద సైకిల్ ర్యాలీని కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. భారత ఎన్నికల సంఘం పట్టణ ప్రాంతాలలో ఓటర్ల జాబితాను పెంచే లక్ష్యంతో ఉంది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత ఓటర్ల జాబితా పటిష్టతను ఆయన వివరిస్తూ, దేశంలో హిమాలయాలలోని ఎత్తైన శిఖరాల నుంచి దక్షిణాన 6 వేల కిలోమీటర్ల తీరప్రాంతం నుంచి పశ్చిమాన ఎడారులు, తూర్పు ప్రాంతాల నుంచి దేశంలో ఓటర్లు ఉన్నారని

- మిగతా 2 లో

రాష్ట్రంలో 3.98 కోట్ల ఓటర్లు

2లో

అవినీతిపరులతోనే

దేశం నాశనం

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ:

దేశాన్ని అవినీతిపరులు నాశనం చేస్తున్నారని, డబ్బు సాయంతో తప్పించుకోగలుగుతున్నారని సుప్రీంకోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. ఎల్గార్ పరిషత్ కేసులో శిక్ష అనుభవిస్తున్న కార్యకర్త గౌతం నవలఖాకు గృహనిర్బంధంపై విచారణ క్రమంలో న్యాయస్థానం పై విధంగా స్పందించింది. జ్యుడిషియల్ కస్టడీకి బదులు

- మిగతా 2 లో

అధిక ధరలపై గ్రీస్‌లో సమ్మె

- కదం తొక్కిన వేలాది మంది ప్రైవేటు ప్రభుత్వ రంగ కార్మికులు
- కిక్కిరిసిన ఎథేన్స్, థెస్సాలోనికి వీధులు
- కనీస వేతనం-ద్రవ్యోల్బణం అదుపునకు కార్మిక సంఘాల డిమాండ్
- కదలని చక్రం-పోర్టులకే ఫెర్రీలు పరిమితం
- అనేక విమానాలు రద్దు

ఎథేన్స్: అధిక ధరలకు వ్యతిరేకంగా గ్రీస్‌లో సార్వత్రిక సమ్మె జరిగింది. ప్రైవేటు, ప్రభుత్వ రంగ కార్మికులు తమ విధులను బహిష్కరించి 24 గంటల సమ్మెలో పాల్గొన్నారు. రాజధాని ఎథేన్స్‌తో పాటు రెండవ అతిపెద్ద నగరమైన థెస్సాలోనికి వీధుల్లో వేలాది మంది నిరసనకారులు కదంతొక్కారు. అధిక ధరలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మె కారణంగా ప్రజా రవాణా స్తంభించింది. విమాన సేవలు రద్దు అయ్యాయి. ఫెర్రీలన్నీ పోర్టులకే పరిమితం కావడంతో గ్రీస్ ద్వీపాలతో సంబంధాలు తెగినట్లు అయింది. పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను మూసివేశారు. ఎథేన్స్, థెస్సాలోనికిలో జరిగిన మార్చ్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రెండు వర్గాలు మొలోటోవ్ కాక్‌టెయిల్స్, రాళ్లను పోలీసులపై విసరగా వారు బాష్పవాయువు, స్టన్ గ్రెనేడ్‌లతో విరుచుకుపడ్డారు. అయితే ఎవరికి గాయాలు అయినట్లు వెంటనే సమాచారం అందలేదు. 'ఎవరూ పనిలేకుండా ఉండరాదు, ఆకలి కేకలు వినిపించరాదు, ఏ ఒక్కరూ ఒంటరి భావనను అనుభవించరాదు' అన్న నినాదంతో కమ్యూనిస్టు అనుబంధ కార్మిక సంఘాలు సమ్మె చేశాయి. పేదరికం, క్షుద్బాధ, దోపిడీ, యుద్ధాలను సృష్టించి వాణిజ్య సంఘాలకు లాభాలు కట్టబెట్టే ప్రజా వ్యతిరేక విధానాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చాయి. గ్రీక్ కుటుంబాలపై భారమైన అధిక ధరలకు వ్యతిరేకంగా కార్మికులు, కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని జీఎస్ఈఈ (ప్రైవేటు రంగ కార్మిక సంఘాల సమాఖ్య) పేర్కొంది. కనీస వేతనాలు పెంచాలని డిమాండు చేశాయి. ప్రస్తుతానికి సగటు వేతనజీవికి నెలకు 700 యూరోలు లభిస్తున్నాయి. ద్రవ్యోల్బణం కట్టడికి మరింత సాహసోపేత చర్యల కోసం కార్మిక సంఘాలు డిమాండే చేశాయి. సెప్టెంబరు ద్రవ్యోల్బణం 12శాతంగా నమోదు అయింది.

బెల్జియంలోనూ సార్వత్రిక సమ్మె జరిగింది. వేతనాల పెంపుదల కోసం ప్రధాన కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి.

రైల్లు-రోడ్డు రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఫలితంగా బ్రస్సెల్స్ విమానాశ్రయంలో 60శాతం విమానాలు రద్దు అయ్యాయి. బస్సులు- ట్యాక్సీలు సరిపడ లేని కారణంగా ఎథేన్స్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికులు అక్కడ నుంచి తమ గమ్యస్థానాలకు చేరుకోవడం కష్టమైంది.

నేపాల్‌లో భూకంపం

ఆరుగురి మృతి - ఐదుగురికి గాయాలు

ఖాట్మండు: నేపాల్ వణికిపోయింది. బుధవారం 6.6 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో ఆరుగురు మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఇద్దరు గల్లంతయ్యారు. ఈ భూకంపం ప్రభావం భారత్ రాజధాని న్యూదిల్లీలో కనిపించిందని అధికారులు తెలిపారు. భూకంప కేంద్రం పిలిభిట్‌లో ఈశాన్య దిశగా 158 కిమీల దూరంలో (ఉత్తరప్రదేశ్‌లోని నగరం) గుర్తించామని, 10కిమీల లోతులో భూకంపం సంభవించిందని ఐరోపా-మధ్యధార భూకంప కేంద్రం (ఈఎంఎస్‌సీ) పేర్కొంది. ఎనిమిది ఇళ్లు కూలిపోగా దోటి జిల్లాలో అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయని జిల్లా డీఎస్పీ భోలా భట్టా తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురిని దోటిలోని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు నేపాల్ హోం శాఖ అధికార ప్రతినిధి ఫణీంద్ర పోఖరెల్ తెలిపారు. భూకంపం ధాటికి ఒక పోలీసు పోస్టు కూలిందని, శిథిలాల కింద చిక్కుకుని ఆరుగురు మరణించారని భోలా భట్టా తెలిపారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ ఆర్మీ, పోలీసు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టినట్లు ఆర్మీ అధికార ప్రతినిధి నారాయణ్ సిల్వాల్ తెలిపారు. గ్రౌండ్ రెస్క్యూ టీమ్ సహాయక చర్యల్లో పాల్గొనగా సుర్ఖేట్, నేపాల్ గంజ్ పట్టణాల్లో రెండు హెలీకాప్టర్లు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మంగళవారం-బుధవారం మధ్యరాత్రి 2.12గంటలప్పుడు (నేపాల్ కాలమానం ప్రకారం) భూమి కంపించిందని దోటి జిల్లా, పూర్బి చౌకి రూరల్ మున్సిపాలిటీ చైర్మన్, ప్రత్యక్ష సాక్షి రామ్ ఉపాధ్యాయ్ తెలిపారు. ఆ సమయంలో పక్క జిల్లాలో ఉన్నట్లు చెప్పారు. 'భూమి కంపించింది. దీంతో అంతా బయటకు పరుగు తీశాం. ఇప్పుడు మృతదేహాల సంఖ్యతో పాటు వివరాల సేకరణలో ఉన్నాం' అని ఆయనన్నారు. 2015లో సంభవించిన రెండు పెద్ద భూకంపాల నుంచి నేపాల్ ఇంకా కోలుకోలేదు. అప్పట్లో తొమ్మిది వేల మంది వరకు మరణించారు. పట్టణాలు, శతాబ్దాల నాటి ఆలయాలు ధ్వంసమయ్యాయి. ఆర్థిక వ్యవస్థకు 6 బిలియన్ల డాలర్ల నష్టం కలిగింది. నేపాల్ ఇప్పటికీ పునర్నిర్మాణ దశలో ఉంది.

ప్రధాని దిగ్భ్రాంతి: ఈ ఘటనపై ట్విట్టర్ మాధ్యమంగా ప్రధాని షేర్ బహదూర్ దౌబా దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు అభయమిచ్చారు. గాయపడిన వారికి తగిన చికిత్స సమయానికి అందేలా చూడాలని, బాధితులకు అవసరమైన సహకారాన్ని అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

చరిత్ర సృష్టించిన తెలుగు మహిళ

వాషింగ్టన్: మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా తొలిసారి భారత సంతతికి చెందిన మహిళ ఎన్నికై చరిత్ర సృష్టించారు. మేరీల్యాండ్ గవర్నర్‌గా వెస్ మూర్ విజయం సాధించారు. వెస్‌మూర్, అరుణ మిల్లర్లు డెమొక్రాట్ల అభ్యర్థులు. వెస్ మూర్, అరుణ మిల్లర్‌కు మద్దతుగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ప్రచారం చేశారు. కాట్రగడ్డ అరుణ మిల్లర్ (58) స్వస్థలం ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లాలోని వెంట్రప్రగడ. ఆమె కృష్ణాజిల్లాలోనే జన్మించారు. వారి కుటుంబం 1972లో అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడింది. అరుణ తండ్రి కాట్రగడ్డ వెంకట రామారావు ఐబీఎం ఉద్యోగి. ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీరింగ్ స్పెషలిస్ట్ అయిన అరుణ మిల్లర్.. మిస్సోరీ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. 1990లో తన స్నేహితుడు డేవిడ్ మిల్లర్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ రేసులో తన ప్రత్యర్థుల నుంచి చివరి నిమిషంలో ఎదురైన గట్టి వ్యతిరేకతను ఆమె అధిగమించారు. హిందూ జాతీయవాదులను ఆశ్రయించారని ప్రత్యర్థి చేసిన ఆరోపణలను అరుణ ఖండించారు. అయితే, మేరీల్యాండ్ గవర్నర్‌గా ఎన్నికైన మొదటి నల్లజాతీయుడు వెస్ మూర్ తన సమీప ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డాన్ కాక్స్‌పై 2-1 తేడాతో గెలిచారు. ఈయన ఆఫ్రికా నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందిన వారు.

ఐదుగురు విద్యార్థుల అదృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

చదువుకుంటున్న ట్యూషన్ వద్దకు వెళ్లి ఉపాధ్యాయులను ఆరాతీశారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. పిల్లలు ట్యూషన్ నుంచి ఇంటికివెళ్తున్నట్లు సీసీ కెమెరాల్లో కూడా రికార్డయింది. ఆ తర్వాత వారు ఎక్కడికి వెళ్లారో అనేది తెలియలేదు. ప్రత్యేక టీమ్ ద్వారా దర్యాప్తు చేస్తున్నట్లు వెస్ట్ సీఐ శివప్రసాద్ తెలియజేశారు.

గవర్నర్లపై రణభేరి

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారని ప్రకటన వివరించింది. ప్యానెల్ సిఫార్సులు, రాష్ట్రంలో ఉన్నత విద్యకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, ప్రముఖ విద్యావేత్తలను విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్లుగా నియమించాలని నిర్ణయించినట్లు ప్రకటన తెలిపింది. కేరళలోని ఉన్నత విద్యా కేంద్రాలను అంతర్జాతీయ ప్రమాణాలకు పెంచేందుకు దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించేందుకు ఉన్నత విద్యారంగంలో నైపుణ్యం కలిగిన వ్యక్తులు విశ్వవిద్యాలయాల సారథ్యంలో ఉండటం ప్రయోజనకరమని మంత్రివర్గం అభిప్రాయపడింది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ఆర్.బిందు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. రాష్ట్రంలోని ఉన్నత విద్య, యూనివర్సిటీల్లో దీర్ఘకాలిక సంస్కరణలు తీసుకొచ్చేందుకు వీలుగా గవర్నర్ స్థానంలో ప్రముఖ విద్యావేత్తలను ఛాన్సలర్లుగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బిందు తెలిపారు. దీనిపై త్వరలో ఒక ఆర్డినెన్స్ తీసుకురానున్నట్లు ఆమె చెప్పారు. ఈ విషయం పై న్యాయ శాఖ తయారు చేసిన ముసాయిదా ఆర్డినెన్స్ పై బుధవారం కేబినెట్ సమావేశంలో చర్చించారు. అయితే ఈ ఆర్డినెన్స్ పై రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సంతకం పెడితేనే అమలులోకి వస్తుంది. దీంతో ఆయన సంతకం పెడతారా లేదా అన్నదానిపై విద్యా శాఖ మంత్రిని మీడియా ప్రశ్నించగా... గవర్నర్ తన రాజ్యాంగ బాధ్యతలకు అనుగుణంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నట్లు బిందు తెలిపారు. రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాల వీసీల నియామకానికి వ్యతిరేకంగా గవర్నర్ ఖాన్ ఇటీవలి చర్యను స్పష్టంగా ప్రస్తావించిన బిందు... ఇటీవల వర్సిటీల పనితీరులో జోక్యం చేసుకున్నారని, ఇది వాటిని చుక్కాని లేకుండా చేసే లక్ష్యంతో ఉందని, ఇది కచ్చితంగా కేరళలో ఉన్నత విద్యకు సంబంధించి హోదాకు సంబంధించి ఆందోళనలను లేవనెత్తిందని అన్నారు. అయితే చర్యను కాంగ్రెస్, బీజేపీ రెండూ వ్యతిరేకించాయి. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వి.డి.సతీశన్ మంత్రివర్గ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. విశ్వవిద్యాలయాలను 'కమ్యూనిస్టు కేంద్రాలు'గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి చేసిన తప్పిదాలకు ఛాన్సలర్‌ను మార్చడం పరిష్కారం కాదన్నారు. ఈ నిర్ణయం పశ్చిమ బెంగాల్‌లో జరిగినట్లుగా రాష్ట్రంలో ఉన్నత విద్యకు హాని కలిగిస్తుందని ఆయన అన్నారు. వీసీల నియామకానికి సంబంధించి ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అధిగమించేందుకే ఆర్డినెన్స్‌ను తీసుకువస్తున్నారని సతీశన్ ఆరోపించారు.

గవర్నర్ ఆర్ఎన్ రవిని తొలగించండి : రాష్ట్రపతికి డీఎంకే వినతి

తమిళనాడు అధికార పార్టీ డీఎంకే, ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన ప్రశాంతతకు ముప్పు అని ఆరోపించింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయిన ప్రభుత్వం ప్రజలకు సేవలందించకుండా ఆయన అడ్డుకుంటున్నారని మండిపడింది. ఆయనను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఒక వినతిపత్రాన్ని పంపించింది. ఆర్.ఎన్.రవి గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించేటప్పుడు రాజ్యాంగాన్ని, చట్టాన్ని పరిరక్షిస్తానని, కాపాడతానని ప్రమాణం చేశారని, ఆ ప్రమాణాన్ని ఆయన ఉల్లంఘిస్తున్నారని రాష్ట్రపతికి సమర్పించిన వినతిపత్రంలో డీఎంకే ఆరోపించింది. ఆయన మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని తెలిపింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయిన ప్రభుత్వం ప్రజలకు సేవ చేయకుండా అడ్డుకుంటున్నారని పేర్కొంది. శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని పేర్కొంది. ప్రభుత్వం పట్ల అసంతృప్తిని రగిలించే విధంగా ఆయన మాట్లాడుతున్నారని, అటువంటి వ్యాఖ్యలను రాజద్రోహంగా కొందరు పరిగణించే అవకాశం ఉందని తెలిపింది. రాజ్యాంగ పదవికి ఆయన అనర్హుడని పేర్కొంది. ఈ వినతి పత్రం పై డీఎంకే అధిష్ఠాన వర్గం నేతలు, ఆ పార్టీ మిత్ర పక్షాల నేతలు సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడులో 20 బిల్లులు గవర్నర్ ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర అసెంబ్లీలో రెండుసార్లు ఆమోదించిన నీట్ మినహాయింపు బిల్లును రాష్ట్రపతికి పంపనందుకు ఏప్రిల్‌లో డీఎంకే నాయకులు గవర్నర్ ఆర్.ఎన్.రవికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఇదిలాఉండగా, తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ కూడా రాష్ట్ర ప్రభుత్వంతో విభేదిస్తున్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ప్రకారం మొత్తం 15 రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ఉమ్మడి నియామక బోర్డుపై చర్చించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆమె పిలిపించారు.

పోలీసు కర్కశం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ... అఖిలపక్ష ఉక్కు పోరాట కమిటీ చేపట్టిన ఉద్యమం ఉధృతరూపం దాల్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ రానున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ... వందలాదిమంది ఉక్కు కర్మాగారం కార్మికులు, ఉద్యోగులు విశాఖలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అయితే ప్రదర్శనను మధ్యలోనే పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. విచక్షణారహితంగా లాఠీలను ఝుళిపించిన పోలీసులు కార్మిక నేతలను బలవంతంగా ఈడ్చుకెళ్లి అక్రమ అరెస్టులకు పాల్పడ్డారు. అఖిలపక్ష పోరాట కమిటీ నాయకులు బుధవారం స్టీల్ ప్లాంట్ నిరసన దీక్ష శిబిరం నుంచి శాంతియుత ప్రదర్శన తలపెట్టారు. తొలుత బైక్ ర్యాలీ నిర్వహించాలని భావించినప్పటికీ అనుమతి లేదని పోలీసులు నిరాకరించారు. దీంతో కాలి నడక ద్వారా అయినా నగరంలో ఉన్న జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు వెళతామని పోరాట కమిటీ నేతలు బయలుదేరడంతో వందలాదిమంది ఉద్యోగులు, కార్మికులు వారి వెంట నడిచారు. సరిగ్గా గాజువాక పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద చేరుకోగానే వందలాది మంది

పోలీసులు ప్రదర్శనను అడ్డుకున్నారు. వివక్షణారహితంగా లాఠీలు ఝుళిపిస్తూ... అనేకమంది పోరాట కమిటీ నాయకులను పోలీసు వాహనాల్లో ఎత్తిపడేశారు. దొరికిన వారిని దొరికినట్లు అరెస్టులు చేశారు. అందర్నీ గాజువాక పోలీస్ స్టేషన్ లో రోజంతా నిర్బంధించారు. పోరాట కమిటీ నాయకులు రామారావు కాలుకు గాయమైంది. మరి కొంతమంది ఉద్యోగులకు కూడా గాయాలయ్యాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు ఆదినారాయణ (ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు), మంత్రి రాజశేఖర్ (ఐఎన్‌టీయుసి జాతీయ నాయకుడు) కో కన్వీనర్ జె.అయోధ్యరాం (స్టీల్ సిఐటియు అధ్యక్షుడు) 68 వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, కె.సత్యనారాయణ రావు, రామకృష్ణ, వరహాల శ్రీనువాసు రావు, డీవీ రమణారెడ్డి, నీరుకొండ రామచంద్రరావు, వైటి దాస్, ఎం రామారావు లతోపాటు దాదాపు 500 మంది విశాఖ ఉక్కు పోరాట కమిటీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీలో ఈనెల 12న జరిగే సభలో పాల్గొంటున్న ప్రధాని నరేంద్రమోదీ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించాలని కోరుతూ తలపెట్టిన తమ ప్రదర్శనను అడ్డుకోవడం అన్యాయమని పోరాట కమిటీ నేతలు మండిపడ్డారు. ప్రాణ త్యాగాలు, ఉద్యమాలతో వచ్చిన విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరిస్తుంటే తామెలా ఊరుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులతో తమ ఉక్కు పోరాటాన్ని ఆపలేరన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాన్ని ప్రధాని దృష్టిలో పడకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రధా మోదీచేత విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రకటన చేయించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని పోరాట కమిటీ నేతలు కోరారు. గత 636 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు ప్రధానమంత్రి పర్యటన రోజు కూడా నిరసన మార్చ్ చేస్తామని స్పష్టం చేశారు. అనేక త్యాగాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను వ్యూహాత్మక విక్రమం పేరిట కేంద్రంలోని బీజేపీ పూర్తిగా అమ్మకానికి పెట్టిందని, ఈద్రోహ పూరిత చర్యకు నిరసనగా గత 635 రోజుల నుండి ఉద్యమం జరుగుతోందన్నారు. స్టీల్‌ప్లాంటు కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజానీకం ఈ ఉద్యమంలో భాగస్వాములుగా వున్నారని, అయినా కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష రాజకీయ పార్టీలను ప్రధాని వద్దకు తీసుకుపోయి ఒత్తిడి చేసి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేయాలని రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్నారని, వైసీపీ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పుడు ప్రధానమంత్రే విశాఖ వస్తున్నందున ఇప్పటికైనా స్టీల్‌ప్లాంటు అమ్మకం ఆపించే ప్రకటన ప్రధాని ద్వారా ముఖ్యమంత్రి చేయించాలని, ఇది ఒక సదవకాశం అని తెలిపారు. అఖిలపక్ష పార్టీలను, కార్మిక, ప్రజా సంఘాల నాయకులను ప్రధాని వద్దకు తీసుకువెళ్లి ఒత్తిడి పెంచాల్సిన రాష్ట్ర ప్రభుత్వం... దీనికి భిన్నంగా కార్మికోద్యమాన్ని అణగదొక్కుతోందన్నారు.

పోలీస్ నిర్బంధాన్ని ఛేదించుకుంటూ నిరసన

మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను నిరసిస్తూ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టాయి. రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు

అఖిలపక్ష కార్మిక సంఘాలు నిరసన ప్రదర్శన తలపెట్టాయి. కాగా పోలీసులు ఈ ప్రదర్శనను అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈస్ట్ ఏసీపీ హర్షిత చంద్ర, సీఐలు వెంకట్రావు, సోమశేఖర్, శ్రీనివాస్ నేతృత్వంలో పోలీస్ బలగాలు ప్రదర్శన అడ్డుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అయినా పెద్ద ఎత్తున కార్మికులు, ప్రజలు జాతీయ రహదారిపై తరలివచ్చారు.

పోలీస్ నిర్బంధాన్ని ఛేదించుకుంటూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టి, అనంతరం అక్కడ సభ నిర్వహించారు. పోరాటాలు చేసి సాధించుకున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అరుణోదయ ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పడాల రమణ, నాయకులు రెహమాన్, మన్మథరావు, కోట సత్తిబాబు, నగర సీఐటీయూ నాయకులు జగ్గునాయుడు, కుమార్, శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు మని, ఐద్వా నాయకులు పద్మ, సత్యవతి, మాజీ కార్పొరేటర్ ఈశ్వరమ్మ, ఇఫ్టు నాయకులు కొండయ్య, పీవోడబ్ల్యు నాయకురాలు లక్ష్మి, అరుణోదయ నాయకురాలు నిర్మల, ప్రజానాట్యమండలి నాయకులు చంటీ, ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకులు నాగభూషణం, జీవియంసి యూనియన్ నాయకులు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 3.98 కోట్ల ఓటర్లు

- పురుషుల కంటే మహిళలే అధికం
- 10 లక్షలకు పైగా ఓటర్ల తొలగింపు
- డిసెంబరు 8వరకు అభ్యంతరాల స్వీకరణ
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా విడుదల చేశారు. బుధవారం అమరావతి సచివాలయం నాల్గోబ్లాక్ లోని పబ్లిసిటీ సెల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 3,98,54,093 మంది సాధారణ, సర్వీస్ ఓటర్లతో ఈ ముసాయిదా జాబితా ఖరారు చేసినట్లు చెప్పారు. ఈ మొత్తం ఓటర్లలో 3,97,85,978 మంది సాధారణ ఓటర్లు కాగా, మిగిలిన 68,115 మంది సర్వీసు ఓటర్లని ఆయన తెలిపారు. అదే విధంగా ఈ మొత్తం ఓటర్లలో 2,01,34,621 మంది మహిళా ఓటర్లు, 1,97,15,614 మంది పురుష ఓటర్లు కాగా మిగిలిన 3,858 మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లని ఆయన వివరించారు. జనాభా నిష్పత్తి ప్రకారం 724 మంది ఓటర్లు, లింగ నిష్పత్తి ప్రకారం 1,025 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈ ముసాయిదా ఓటర్ల జాబితాలో 2,41,463 మందిని కొత్త ఓటర్లుగా నమోదు చేయగా, 11,23,829 ఓట్లను తొలగించామన్నారు. ఈ తొలగించిన ఓటర్లలో 40,345 మంది మరణించినట్లుగా, 31,158 మంది వేరే ప్రాంతాలకు తరలి పోగా, 10,52,326 మంది ఓటర్ల పేర్లు పునరావృతం అయినట్లుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఓటర్ల జాబితాలో బహుళ ఎంట్రీలతో పాటు ఫొటో, జనాభా పరంగా సారూప్యంగా ఉన్న ఓటర్లను తొలగించేందుకు ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ను అభివృద్ధి చేశామన్నారు. ఈ ప్రక్రియ ద్వారా గత ఓటర్ల జాబితాలో భారత ఎన్నికల సంఘం గుర్తించిన ఓటర్ల వివరాలను ఇ.ఆర్.ఓ.ల పరిశీలనకోసం అందుబాటులో ఉంచగా, పరిశీలన తదుపరి 10,52,326 మంది ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించామని తెలిపారు. ఈ విధంగా గత ఏడాది ఓటర్ల జాబితాతో పోలిస్తే ప్రస్తుత ముసాయిదా ఓటర్ల జాబితాలో 8,82,366 మంది ఓటర్లు తగ్గినట్లు ఆయన వివరించారు. ఈ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం అత్యధిక స్థాయిలో ఓటర్లు ఉన్న జిల్లాలుగా వరుసగా అనంతపురం (19,13,813 ఓటర్లు), కర్నూలు (19,13,654 ఓటర్లు), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (18,99,103 ఓటర్లు) జిల్లాలు నిలిచాయని, అదే విధంగా అత్యల్ప స్థాయిలో ఓటర్లు ఉన్న జిల్లాలు వరుసగా అల్లూరిసీతారామరాజు (7,15,990 ఓటర్లు), పార్వతీపురం మన్యం (7,70,175 ఓటర్లు), బాపట్ల (12,66,110 ఓటర్లు) జిల్లాలు నిలిచాయని తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబందించి క్లెయిములు, అభ్యంతరాలను ఈ ఏడాది డిశంబరు 8 వరకూ స్వీకరించనున్నట్లు చెప్పారు. ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నవంబరు 19, 20, డిసెంబరు 3,4 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2023 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వాళ్లు ఓటర్లుగా నమోదు అయ్యేందుకు అర్హులని, 2023 ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే వాళ్లు కూడా ఓటర్లుగా నమోదు అయ్యేందుకు ముందుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈసారి నిరాశ్రయులకూ ఓటరు కార్డు ఇవ్వాలని భారత ఎన్నికల సంఘం నిర్ణయించిందని, ఎలాంటి గుర్తింపూ లేకపోయినా విచారణ అనంతరం వారికి ఓటరు కార్డు జారీ చేయనున్నట్లు చెప్పారు. 2023 జనవరి 5 న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామన్నారు. ఓటరు కార్డు కోసం ఆధార్ తప్పనిసరి చేయడం లేదని, కాని ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధాన ప్రక్రియ ఇప్పటికే 60 శాతం మేర పూర్తి అయిందన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో వలంటీర్ల సేవలను వాడుకోవద్దని ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలను జారీచేశామన్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రులు, టీచర్ల ఓటర్ల నమోదు ప్రక్రియపై ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై విచారణ జరిపి తప్పుడు ధృవీకరణ ఇచ్చే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఒక ప్రశ్నకు సమాధానంగా ఎన్నికల అధికారి మీనా చెప్పారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం డిప్యూటీ సెక్రటరీ వెంకటేశ్వరరావు సమావేశంలో పాల్గొన్నారు.

నీట్-పీజీ 2023 ఇదే చివరి పరీక్ష!

(మొదటిపేజీ తరువాయి)

పరిమితిని పొడిగించడానికి ఎన్ఎంసీ చట్టం సంబంధిత నిబంధనలను ప్రభుత్వం సెప్టెంబర్‌లో అమలు చేసింది. చట్టం ప్రకారం, కమిషన్ అమల్లోకి వచ్చిన మూడు సంవత్సరాలలోపు నిబంధనల ద్వారా పేర్కొన్న విధంగా సాధారణ చివరి సంవత్సరం అండర్ గ్రాడ్యుయేట్ వైద్య పరీక్ష, నెక్స్‌ట్ నిర్వహించాలి. ఈ చట్టం సెప్టెంబర్ 2020 నుంచి అమలులోకి వచ్చింది. మెడికల్ సైన్సెస్‌లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌కు బదులుగా న్యూదిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఈ పరీక్షను నిర్వహించవచ్చని, అయితే ఈ విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆ వర్గాలు తెలిపాయి. నెక్స్‌ట్‌ను నిర్వహించాలంటే విధానాలను రూపొందించడం, పాఠ్య ప్రణాళిక, పరీక్ష నమూనా, పద్ధతి వంటి సన్నాహాలు అవసరమని, విద్యార్థులు దీనికి సన్నద్ధం కావడానికి తగిన సమయం ఇవ్వవలసి ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రధాన పరీక్షకు ముందు మాక్ టెస్టులు నిర్వహించాల్సి ఉంటుంది. నెక్స్‌ట్ ప్రాముఖ్యత ఏమిటంటే, ఇది భారతదేశంలో లేదా ప్రపంచంలోని ఏ ప్రాంతంలోనైనా శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా ఉంటుందని, అందువల్ల ఇది విదేశీ వైద్య గ్రాడ్యుయేట్లు, పరస్పర గుర్తింపు సమస్యను పరిష్కరిస్తుందని అధికారులు తెలిపారు.

భద్రతా వలయంలో విశాఖ

(మొదటిపేజీ తరువాయి)

వారం రోజులపాటు నిర్వహించకూడదని పోలీసులు ఆంక్షల నేపథ్యంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. మరోపక్క ముందస్తు అరెస్టులకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

వివిధ రాజకీయ పక్షాల నేతలను, కార్మిక ,ఉద్యోగ , ప్రజాసంఘాల నేతలను 11వ తేదీ ఉదయాన్నే అరెస్టు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

శతాధిక ఓటర్లు 2.50 లక్షల మంది

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 'మా ఓటర్ల జాబితాలో దాదాపు 2.49 లక్షల మంది ఓటర్లు (వయస్సు) 100 పైచిలుకు ఉన్నారు. మీరు వారితో సంభాషించినప్పుడు, వారు తమ జీవితమంతా ఓటు వేస్తున్నట్లు గుర్తించినప్పుడు అది ఎంతటి ఉపశమనాన్ని, ఆనందాన్ని ఇస్తుందో తెలుసుకోవడం మీకు సంతోషంగా ఉంటుంది' అని అన్నారు. ఇటీవల మరణించిన భారతదేశపు తొలి ఓటరు శ్యామ్ శరణ్ నేగి వయస్సు 106 సంవత్సరాలని, ఆయన మరణానికి మూడు రోజుల ముందు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారని, 'స్ఫూర్తి అంటే అదేనని' అన్నారు. సారాంశ సవరణ ప్రతి సంవత్సరం జరుగుతుందని, అయితే ఈ సంవత్సరం తాము చాలా దృష్టి కేంద్రీకరించి, పట్టణ ప్రాంతాల నుంచి పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడానికి ఒక నిర్దిష్ట ఉద్దేశంతో పూణె నుంచి దేశమంతటా దీన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. 'దాని అర్థం ఏమిటి? దేశంలోని ప్రతిచోటా, సాధ్యమైన సుదూర రాష్ట్రాలలో, అది కొండలు, తీర రేఖలు, ప్రతిచోటా, దుర్గమమైన భూభాగాలు, ఎడారులు, ప్రతిచోటా ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడమే కాకుండా తన ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తారు' అని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని ఓటర్లందరూ, యువకులందరూ పాల్గొని ఓటు వేయాలని అభ్యర్థించాలన్నారు. 'కొన్ని నగరాలకు, నేను వాటికి పేరు పెట్టడం లేదు. నిజంగా అలాంటి ఓటింగ్ చేయవద్దు. పట్టణ ప్రాంతాల్లో మనం కవర్ చేయాల్సిన మైదానం మొత్తం ఉంది. అందుకే అవగాహన కల్పించడానికి ఈ ర్యాలీ నిర్వహించాం' అని అన్నారు. కొన్ని అభివృద్ధి చెందిన పెద్ద మెట్రో నగరాల్లో, పట్టణ ఓటర్లలో ఉదాసీనత కనిపిస్తోందని, అయితే ఈ నగరాలు కూడా మనస్ఫూర్తిగా ఓటింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు దోహదపడాలని ఆకాంక్షించారు. 'యువతకు కూడా ఇది వర్తిస్తుంది. వారు వాట్సాప్‌లో తమ అభిప్రాయాలను చెప్పగలిగితే, వారు ఓటు వేయడం ద్వారా తమ అభిప్రాయాన్ని చాలా బాగా చెప్పగలరు. అర్హత తేదీలలో 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంది' అని రాజీవ్ కుమార్ తెలిపారు.

దేశం నాశనం: సుప్రీంకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

గృహ నిర్బంధంలో ఉంచాలని నవలఖ కోర్టుకు విన్నవించారు. ఎన్ఐఏ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు దీనిపై అభ్యంతరం వ్యక్తంచేశారు. నవలఖ వంటి వారు దేశాన్ని నాశనం చేయాలని అనుకుంటారన్నారు. 'వారి సిద్ధాంతం అదే. వాళ్లు అమాయకులు అని కాదు నిజమైన యుద్ధంలో సంబంధం ఉన్న వారితో వీరికి సంబంధం ఉంది' అని రాజు అన్నారు. దీనిపై 'మీకు నిజంగా దేశాన్ని ఎవరు నాశనం చేస్తున్నారని తెలుసుకోవాలని ఉందా? అవినీతిపరులు... అక్రమార్కులు. మీరు వెళ్లే ప్రతి కార్యాలయంలో జరుగుతున్నదేమిటి? అవినీతిపరులపై చర్యలు తీసుకునేది ఎవరు? వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నామని మనల్ని నిందించాలి. ఎన్నికైన ప్రతినిధులను కొనేందుకు కోట్లాది రూపాయల గురించి మాట్లాడుకునే వీడియో చూశాం. అలాంటి వారు మన దేశానికి వ్యతిరేకంగా ఏమీ చేయడం లేదని మీరు అనుకుంటున్నారా? మీరు సమర్థిస్తూ పోతే వారు మరింతగా రెచ్చిపోతారు. సంతోషంగా తప్పించుకునేందుకు డబ్బు సంచులు ఉంటాయి' అని జస్టిస్ కేఎం జోసఫ్, జస్టిస్ రిషికేశ్ రాయ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. నవలఖ తరపు సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ వాదనలు వినిపించారు. ఆయనకు జైలులో చికిత్స అందించే పరస్థితి లేదని వైద్య నివేదికలు సూచిస్తున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే గృహ నిర్బంధానికి అనుమతిస్తే నవలఖకు ఎలాంటి సూచనలు చేయాలో తెలపండి' అని ఏఎస్‌జీని ఉద్దేశించి ధర్మాసనం పేర్కొంది. 70ఏళ్ల నవలఖ ముంబై సమీపంలోని తలోజ జైల్లో ఉన్నారు.

మోదీ అన్యాయాన్ని ఎండగడుతూ..

రేపు, ఎల్లుండి నిరసనలు

ఉక్కు ప్రైవేటీకరించబోమని మోదీ ప్రకటించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం పదేపదే చేస్తున్న అన్యాయానికి నిరసనగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నల్ల జెండాలు, బ్యాడ్జీలతో నిరసన చేపట్టాలని వామపక్ష పార్టీలు నిర్ణయించినట్లు సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు వెల్లడించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ, అక్కడున్న ఉక్కు పరిరక్షణ కార్మిక పోరాట కమిటీ అధ్వర్యంలో కార్మికులు ప్రశాంతంగా బైక్ ర్యాలీ చేస్తుంటే, 200 మందిని అరెస్టు చేయడాన్ని వామపక్షాల నాయకులు తీవ్రంగా ఖండించారు. విజయవాడ బాలోత్సవంలో బుధవారం జాస్తి కిశోర్‌బాబు అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కె.రామకృష్ణ మాట్లాడుతూ...విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరించబోమని స్పష్టంగా ప్రకటించిన తర్వాతే...విశాఖలో మోదీ అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్క కలం పోటుతో ప్రైవేట్‌పరం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్రంలోని బీజేపీయేతర రాజకీయ పార్టీలన్నీ మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసించాలని కోరారు. మోదీ పర్యటనను వైసీపీ ప్లీనరీ కంటే మిన్నగా విజయవంతం చేయడానికి అధికార వైసీపీ, జగన్ ప్రభుత్వం తపన పడుతోందనీ, పెద్దఎత్తున అధికారులు, ఉద్యోగులను నియమించి, లక్షలాది మంది ప్రజలను సమీకరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నదన్నారు. ఈ ఎనిమిదిన్నర ఏళ్లల్లో రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం ఏ ఒక్క అంశంలోనైనా న్యాయం చేసిందా? అని జగన్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. పైపెచ్చు 2019 ఎన్నికల్లో తనకు అత్యధికంగా ఎంపీలను ఇస్తే, కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా వారి మెడలు వంచి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలను సాధించి తీరుతామని జగన్ ప్రగల్భాలు పలికారని గుర్తుచేశారు. రాష్ట్రానికి మోదీ ప్రత్యేకహోదా ఇచ్చారా, విభజన హామీలేమైనా సక్రమంగా అమలే చేశారా, విశాఖ రైల్వేజోన్‌పై ఇప్పటికీ సందిగ్దత నెలకొందనీ, అది ప్రధాని ప్రారంభోత్సవాల అజెండాలో లేకుండా పోయిందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నగగగగగగ వాగ్దానాన్ని అమలు చేయలేదని దుయ్యబట్టారు. పోర్టు నిర్మాణాన్ని పక్కన పెట్టారనీ, తుదకు సీఎం సొంత జిల్లాలోని కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం ఏమైందనీ ప్రశ్నించారు. మోదీకి బీజేపీ నేతలు ఆహ్వానం పలికేందుకు సిద్ధమవ్వగా, వైసీపీ వారికి అవకాశం ఇవ్వకుండా అంతా తానై, ఎంపీ విజయ సాయిరెడ్డి అధ్వర్యంలో పర్యటనా ఏర్పాట్లను చక్కదిద్దుతున్నారని రామకృష్ణ దుయ్యబట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను వైసీపీ, జగన్ ప్రభుత్వం ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా ప్రధాని మోదీకి పెద్దపీట వేసి, ఎక్కడ లేని గౌరవాన్ని ఆయనకు కల్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు ద్రోహం చేసిన వారికే...ప్రజల ఖర్చుతో పెద్దపీట వేస్తున్నారనీ, ఈ హక్కు వైసీపీకి ఎవరిచ్చారనీ, మోదీ రాష్ట్రానికి ఏం చేశారనీ ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేస్తున్నారని నిలదీశారు. ప్రత్యేక హోదా ఇవ్వనందుకు మోదీకి సన్మానం చేస్తున్నారా? రైల్వేజోన్‌పై స్పష్టత లేనందుకా? అని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర సుజల ప్రవంతికి, పోలవరానికి నిధులు ఇవ్వలేదన్నారు. జాతికీ, రాష్ట్రానికీ గర్వకారణంగా ఉన్న విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం చేసినందుకా?, అందుకు సన్మానం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపినా, కనీసం ప్రధాని స్పందించలేదనీ, అందుకేనా సన్మానం చేస్తున్నారా?, దీనిపై రాష్ట్ర ప్రజలకు వైపీపీ, సీఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు. ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని, ఆయా డిమాండ్లను ప్రధాని మోదీని అడిగి, ఆయన ద్వారా స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. బీజేపీకి రాష్ట్రంలో నిలువ నీడ లేకుండా పోయిందనీ, ప్రజల్లో అభాసుపాలు అయిం దనీ, అలాంటి బీజేపీకి వైసీపీ కొమ్ముకాస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. 11వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, వామపక్ష కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును సంపూర్ణంగా బలపరుస్తున్నామన్నారు. అదే రోజు విశాఖ స్టీల్ ప్లాంట్ సమ్మెకూ మద్దతు తెలుపుతున్నామని స్పష్టం చేశారు. విశాఖలో కార్మికుల ప్రదర్శనలకు అనుమతులిచ్చి, మళ్లీ అందరికీ 41ఏ నోటీసులు జారీజేస్తున్నారనీ, రాష్ట్రంలో ఇది ఒక తమాషాగా మారిపోయిందన్నారు. ఈ రకమైన దుర్మార్గపు, నిరంకుశ పద్ధతులకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలనీ, బీజేపీ నిరంశ, ఫాసిస్టు పద్ధతులన్నీ వైసీపీ అప్పుతెచ్చుకుంటోందని విమర్శిం చారు. సీపీఐ(ఎంఎల్) నాయకులు జాస్తి కిశోర్‌బాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాదులు, గుత్త కంపెనీలకు అనుకూలంగా ఆర్థిక నిర్ణయాలను తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కారుచౌకగా కట్టబెడుతున్నదని విమర్శించారు. రాష్ట్రానికి మోదీ చేసిన అన్యాయం, ఫాసిస్టు విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడంపై వామపక్షాలు నిరసనకు పిలుపునిచ్చామని చెప్పారు. వై.వెంకటేశ్వరరావు (సీపీఎం), పోలారి (సీపీఐ(ఎంఎల్)), డి.హరినాథ్ (సీపీఐ(ఎంఎల్) లిబరేషన్), ఖాదర్ బాషా (ఎంసీపీఐ(ఎం)), బీఎస్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

రేపటి నిరసనలకు జగన్ సహకరించాలి

లేనిపక్షంలో మోదీ తప్పుడు నిర్ణయాన్ని సమర్థించినట్లే
ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 11న కార్మిక సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్ర మాలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విజ్ఞప్తి చేశారు. అమ్మ పెట్టదు...అడుక్కు తిననివ్వదన్న చందాన జగన్ ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశంలో ద్వంద్వ విధానాన్ని అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను తాము వ్యతిరేకిస్తున్నామని చెబుతూనే, దానికోసం కేంద్రంపై ఏమాత్రం ఒత్తిడి చేయకుండా కార్మికులను మభ్యపెడుతోందన్నారు. మరోపక్క కార్మికులు కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చేసే ఆందోళనలను అణచివేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. బుధవారం విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ చేపట్టిన స్కూటర్ ర్యాలీకి ప్రభుత్వం తొలుత అనుమతించి, తర్వాత రద్దు చేయడం, దాదాపు 400 మంది కార్మికులను అరెస్ట్ చేయడం ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. దీనిని బట్టి కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలను జగన్ సమర్థించినట్లు స్పష్టమవుతోందన్నారు. నిజంగా రాష్ట్ర ప్రభుత్వానికి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలన్న చిత్తశుద్ధి ఉంటే ఈనెల 11, 12 తేదీల్లో వామపక్షాలు, 11న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక, కమిటీల అధ్వర్యంలో జరిగే ఆందోళనా కార్యక్రమాలకు సహకరించాలని ఓబులేసు కోరారు.

అయ్యన్నపై 467 సెక్షన్ వర్తించదు

41ఏ నోటీసు ఇచ్చి విచారించవచ్చు: హైకోర్టు స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిపై సీఐడీ నమోదు చేసిన 467 సెక్షన్ వర్తించదని హైకోర్టు స్పష్టం చేసింది. అయ్యన్నపై నమోదైన భూ ఆక్రమణ కేసు కొట్టివేయాలని దాఖలైన పిటిషన్‌పై బుధవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. నకిలీ ఎన్‌వోసీ సమర్పించి 0.16 సెంట్ల జల వనరుల శాఖ భూమిని కబ్జా చేశారంటూ ఆయనపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అయ్యన్న హైకోర్టును ఆశ్రయించారు. ఆయనపై కావాలనే సెక్షన్ 467 కింద కేసు నమోదు చేశారని, అసలు ఈ కేసులో ఆ సెక్షన్ వర్తించదని పిటీషనర్ తరపు న్యాయవాది వాదించారు. అయ్యన్న కావాలని ఫోర్జరీ చేశారని, ఈఈ దానిపై ఫిర్యాదు చేయగా, ఆయనను భయపెట్టడం, బెదిరించడం లాంటివి చేసినందున సెక్షన్ 467 వర్తిస్తుందని సీఐడీ తరపు న్యాయవాది వాదించారు. రెండుపక్షాల వాదనలు విన్న హైకోర్టు అయ్యన్నపై 467 సెక్షన్ వర్తించదని తేల్చిచెప్పింది. సీఆర్‌పీసీ నిబంధనల ప్రకారం 41ఏ కింద నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించవచ్చని, ఆయనపై మోపిన అభియోగాలపై సీఐడీ తన దర్యాప్తు కొనసాగించుకోవచ్చునని వెల్లడించింది.

చేతివృత్తులను కాపాడుకోవాలి: జేవీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బహుళ జాతి కంపెనీల కబంధహస్తాల నుంచి చేతివృత్తులను కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. శతాబ్దాలగా కొనసాగుతున్న చేతివృత్తుల్లో బహుళజాతి కంపెనీలు చొరబడి వాటిని కబళించడం వల్ల చేతి వృత్తిదారుల జీవన పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి అధ్యక్షతన జరిగింది. జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారవాద ఆర్థిక, పారిశ్రామిక విధానాలతో తరతరా లుగా సమాజానికి సేవలందిస్తున్న చేతి వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నా యన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన చేతివృత్తిదారుల జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి, మారిన నూతన సాంకేతిక యంత్ర పరికరాలను అందిం చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సేవా రంగాలైన రజక, క్షౌర, దర్జీ తదితర చాలా వృత్తులు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారి జీవన పరిస్థితులు మెరుగుపడాలంటే బహుళ జాతి కంపెనీల లాభాల కోసం పనిచేస్తున్న పాలకవర్గాల మెడలు వంచి, తమ వృత్తులను పరిరక్షించేందుకు చేతి వృత్తిదారులు మరింత చైతన్యంతో సమరశీల ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ చేతివృత్తిదారులను ఉద్ధరిస్తామని గొప్పలు చెప్పి ఏర్పాటు చేసిన 57చేతివృత్తుల కార్పొరేషన్లకు నిధులు కేటాయించకపోవడంతో చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారని విమర్శించారు. చేతి వృత్తిదారుల కార్పొరేషన్‌కు తక్షణమే నిధులు కేటాయించి చేతి వృత్తిదారులందరికీ సబ్సిడీ రుణాలు అందజేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15న తమ సమాఖ్య అధ్వర్యాన విజయవాడలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రజకులను ఎస్సీల్లో చేర్చాలని, దాడులను, అత్యాచారాలను, సాంఘిక బహిష్కరణలను ఆపాలని రజకులు చేస్తున్న ఆందోళనకు సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశం సంఘీభావం తెలిపింది. చేతివృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సి.లింగమయ్య(అనంతపురం), రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా కె.శైలజను సమావేశంలో ఎన్నుకున్నారు. రజక సంఘం నాయకులు సి.లింగమయ్య, హరికృష్ణ, టి.మాల కొండయ్య, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు ఎం.కారన్న, ఎం.రామ్మోహన్, గొర్రెల పెంపకం దారుల సంఘం నాయకులు ఎం.నారాయణ బాబు, పొట్టేలు పెంటయ్య, చేనేత సంఘం నాయకులు కడుపు కన్నయ్య, సంజీవ రాయుడు, పంచ వృత్తి సంఘం నాయకులు వీరశేఖర్, దుర్గారావు, మత్స్యకారుల సంఘం నాయకులు సీహెచ్.నరసింహమూర్తి, టి.రంగనాథ్, కుమ్మర సంఘం నాయకులు జి.నాగరాజు, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

రేపు స్పెషల్ రౌండు ఇంజినీరింగ్ సీట్ల ఖరారు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్-2022 (ఎంపీసీ విభాగం) స్పెషల్ రౌండు కౌన్సెలింగ్ సీట్లను ఈనెల 11న వెల్లడిస్తారు. ఇప్పటికే వెబ్ ఆధారిత ఆప్షన్లు ఇచ్చిన అభ్యర్థులకు చేర్పులు, మార్పుల కోసం ఇచ్చిన గడువు పూర్తయింది. స్పెషల్ రౌండు కౌన్సెలింగ్‌కు ఈనెల 5న కన్వీనర్ ప్రకటన జారీజేశారు. ఇప్పటికే ఇంజినీరింగ్ తరగతుల ఆలస్యం కావడంతో, వారం రోజుల్లో స్పెషల్ రౌం డును ముగించనున్నారు. సీట్లు పొందిన విద్యార్థులంతా ఆయా ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈనెల 11 నుంచి 14వ తేదీ మధ్య రిపోర్టు చేయాలి. స్పెషల్ రౌండు కౌన్సెలింగ్‌లో 20 వేలకుపైగా సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇందులో అత్యధికంగా మెకానికల్, సివిల్ బ్రాంచి సీట్లు ఉన్నట్లు తెలిసింది. ఎక్కువమంది విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ), దాని అనుబంధంగా వచ్చిన నూతన కంప్యూటర్ కోర్సులను ఎంచుకున్నారు. ఆ తర్వాత ఈఎస్ఈ, ఈఈఈ బ్రాంచీలపై మొగ్గు చూపారు. దీంతో మెకానికల్, సివిల్‌కు ఆదరణ తగ్గింది. ఈ స్పెషల్ రౌండుతో మొత్తం కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కానుంది. మొదటి, రెండుతోపాటు స్పెషల్ రౌండులో సీట్లు వెబ్ ఆధారిత ఆప్షన్లు ఇచ్చి కన్వీనర్ కోటాలో సీట్లు పొందిన అర్హత గల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉంటుంది.

సీపీఐలో చేరిన జమలయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా, రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన పి.జమలయ్య ఆయా బాధ్యతలకు రాజీనామా చేసి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. విజయవాడలోని దాసరి భవన్‌లో రామకృష్ణ జమలయ్యకు బుధవారం సీపీఐ కండువా వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర నాయకులు వై. చెంచయ్య పాల్గొన్నారు.

నార్ల చంద్రశేఖరరావు సంస్మరణ సభ నేడు

విశాలాంధ్ర-విజయవాడ: స్థానిక మొఘల్‌రాజపురంలోని సిద్దార్థ అకాడమీ ఆడిటోరియంలో గురువారం ఉదయం గం.10.30లకు ప్రముఖులు నార్ల చంద్రశేఖరరావు సంస్మరణ సభ నిర్వహించనున్నారు. అభిమానులు పెద్ద సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

హక్కుల సాధనకు సంఘటితమవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-చల్లపల్లి: రైతులు తమ హక్కులను సాధించుకునేందుకు సంఘటితమవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజక వర్గ రైతు సంఘం మహాసభ నిమ్మగడ్డలో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన ప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో అనేకమంది రైతులు అప్పుల ఊబిలోకూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు కావలసింది మద్దతు ధర కాదని, లాభసాటి ధర కావాలని డిమాండ్ చేశారు. హక్కులను సాధించుకునేందుకు రైతులంతా సంఘటితమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సు అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆ విషయాన్ని చెత్త బుట్టలో పడేసిందని విమర్శించారు. బ్యాంకుల వద్ద రైతులు తీసుకున్న రుణాలను ముక్కు పిండి వసూలు చేసే ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసి పేద ప్రజల సొమ్ము కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వల్ల భవిష్యత్తులో వ్యవసాయం చేయలేని పరిస్థితి దాపురించిందన్నారు.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామస్థాయి నుంచి సంఘాలను బలోపేతం చేసుకోవాలని ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టాలని సూచిం చారు. రైతు సంఘం నాయకులు గుత్తికొండ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, సీనియర్ నాయకులు మాలేంపాటి కాంచన రావు, రైతు సంఘం నాయకులు వేమూరి రత్నగిరి రావు మాట్లాడారు.

చంద్ర పుల్లారెడ్డి ఆశయ సాధనకు ఐక్య పోరాటాలు

విశాలాంధ్ర-పాములపాడు: పేద ప్రజల ఆశాజ్యోతి, మాజీ శాసనసభ్యులు చంద్ర పుల్లారెడ్డి ఆశయాల సాధనకు ఐక్య పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్య నారాయణమూర్తి పిలుపునిచ్చారు. చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతి సందర్భంగా బుధవారం కర్నూలు జిల్లా వేంపెంట గ్రామంలో గ్రామ నడిబొడ్డున ప్రతాప్ అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు హాజరై ప్రసంగించారు. తొలుత నేతలు పుల్లారెడ్డి అమరవీర స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ మాట్లాడుతూ... పుల్లారెడ్డి చదువుకునే రోజుల్లోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని నెహ్రూ అరెస్ట్‌కు నిరసనగా ఆందోళన చేశారని, అనేక రాజకీయ తరగతులలో పాల్గొని పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు సారథ్యంలో ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. మద్రాసు అసెంబ్లీలో రాయలసీమ వెనుకబడి తనాన్ని చాటిచెప్పిన మహా నాయకుడని కొనియాడారు. కర్నూలు జిల్లాతో పాటు దేశవ్యాప్తంగా విప్లవ పోరాట పందాను ఎంచుకొని చివరి వరకు పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తూ తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఈరోజు దేశంలో నరేంద్ర మోదీ అవలంబిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా, పేద ప్రజల హక్కుల కోసం ఐక్య పోరాటాలు నిర్వహించి పార్టీని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రామాంజనేయులు, రంగనాయుడు మాట్లాడుతూ... నందికొట్కూరు నియోజక వర్గంలో చంద్ర పుల్లారెడ్డి ఆశయాల సాధన కోసం, పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన ప్రత్యక్ష పోరాటాలు చేస్తామన్నా రు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, రఘురాం మూర్తి, శ్రీనివాసులు, మోట రాముడు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా నాయకులు సుగుణమ్మ, లక్ష్మీనారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, దినేష్, సీపీఐ మండల నాయకులు ప్రసాద్, ఆనందం, పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న హిందూ మహాసముద్రంలో అల్పపీడనం ఏర్పడిందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు తెలియజేశారు. రాబోయే 48 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని, శనివారం లోపు వాయువ్య దిశగా కదులుతూ తమిళనాడు-పుదుచ్చేరి తీరాల వైపు పయనించే అవకాశం ఉందని వెల్లడించారు. శుక్రవారం, శనివారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా పిడుగులతో కూడిన భారీవర్షాలు, చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.దక్షిణాంధ్ర-తమిళనాడు తీరాల వెంబడి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. పిడుగులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టుప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తీరం వెంబడి బుధవారం నుంచే చల్లటి ఈదురు గాలులు అధికంగా వీయడంతో తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. మరోపక్క విశాఖలో ఈనెల 11, 12 తేదీల్లో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో సభ ఏర్పాట్లపై అధికారుల్లో ఆందోళన నెలకొంది.

‘గ్రీన్‌కో’ రైతులకు నష్టపరిహారమివ్వాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు మధు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురంలోని గ్రీన్‌కో ప్రాజెక్టు పనులతో భూములు కోల్పోతున్న రైతులకు, పేదలకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసాన్ని ప్రభుత్వం కల్పించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు పి.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు బుధవారం ఆయన ఒక లేఖ రాశారు. పిన్నాపురంలో దాదాపు 6వేల ఎకరాల భూమిలో సుమారు 2050 ఎకరాలు రైతుల పట్టా భూములు కాగా, 1500 ఎకరాలు తరతరాలుగా పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములున్నాయని, పిన్నాపురంలో 450 కుటుంబాలకు సంబంధించిన రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుని జీవిస్తున్నారని వివరించారు. దాదాపు రెండు వేల ఎకరాల అటవీ భూముల్లో పదివేల గొర్రెలు, మేకలు, వేయికిపైగా ఆవులు, గేదెల మేతకు వినియోగించుకుని రైతులు జీవిస్తున్నారన్నారు. గ్రీన్‌కో ప్రాజెక్టు (ఐఆర్‌ఏపీ) అటవీ భూమిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. గ్రీన్‌కో కంపెనీ చేపట్టిన సోలార్, పవన, పునరుత్పాదక జల విద్యుత్ పరిశ్రమ నిర్మాణం పూర్తయితే పిన్నాపురంలో కేవలం 50ఎకరాల భూమి మాత్రమే మిగులుతుందన్నారు. మిగిలిన ఇళ్లు కూడా గ్రీన్‌కో రిజర్వాయర్ నిర్మాణం కోసం చేస్తున్న బ్లాస్టింగ్‌లతో గ్రామంలోని మట్టి మిద్దెలు అన్నీ బీటలు వారాయని, గ్రామ ప్రజలు నిద్ర లేని రాత్రులు గడపాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని 2013 భూసేకరణ చట్టం ప్రకారం హైకోర్టు ఆదేశాలను అమలు చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పరిహారాన్ని పెంచి ఇవ్వాలని, గ్రీన్‌కో ప్రాజెక్టులో ఉపాధి కోల్పోతున్న పిన్నాపురం గ్రామ రైతు కూలీలకు ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిగా పరిహారం ఇచ్చేంత వరకు ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని, ఆ తర్వాతే నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

డ్రోన్ చిత్రాలతో రీసర్వే: సిద్ధార్థ జైన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అత్యు న్నత ప్రమాణాలతో కూడిన డ్రోన్ చిత్రాల అధారంగా భారీ స్థాయి రీసర్వే చిత్రపటాలు తయారు చేస్తున్నట్లు సర్వే సెటిల్‌మెంట్లు, ల్యాండ్ రికార్డుల కమిషనర్ సిద్ధార్థ జైన్ తెలిపారు. రాష్ట్రంలో ‘వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకం’ పేరిట సమగ్ర భూ సర్వే ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంచాలకుల కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యశాలను నిర్వహించారు. డ్రోన్ చిత్రాలను ఉపయోగించి భారీ స్థాయి చిత్రాలను రూపొందించే క్రమంలో ఎదురవుతున్న సాంకేతిక అంశాలు ప్రధానంగా చర్చించారు. హైదరాబాద్ సర్వే విభాగపు అధికారులు... పరిమాణాత్మక ఆర్థో రెక్టిఫైడ్ (ఓఆర్ఐ) దృశ్య నాణ్యత, స్థాన ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడం, మంచి ఫలితాల కోసం నిరంతర నాణ్యత తనిఖీ పద్ధతి తదితర అంశాలపై విలువైన సూచనలను అందించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ, రీసర్వే ప్రక్రియలో భాగంగా కొనసాగుతున్న డ్రోన్ సర్వే నుంచి గుణాత్మక, పరిమాణాత్మక ఆర్థో రెక్టిఫైడ్ (ఓఆర్ఐ) చిత్రాలను రూపొందించే మార్గాలపై కార్యాచరణను వేగవంతం చేశామన్నారు. గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు, చెక్ పాయింట్ల ఏర్పాటులో మంచి ఫలితాలను సాధించేందుకు వాంఛనీయ ఖచ్చితత్వంతో డ్రోన్ చిత్రాలను రూపొందించేందుకు సర్వే ఆఫ్ ఇండియా తీసుకున్న ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. వర్క్ షాపులో సర్వే సెటిల్‌మెంట్ల ల్యాండ్ రికార్డుల అదనపు సంచాలకులు శ్రీనివాసులు, కర్నూలు ప్రాంతీయ సంచాలకులు వెంకటేశ్వరరావు, కాకినాడ ప్రాంతీయ ఉప సంచాకులు కేజియా కుమారి, సర్వే ట్రైనింగ్ అకాడమీ వైస్ ప్రిన్సిపాల్ కుమార్, వివిధ విభాగాల అధికారులు, రీ-సర్వే ప్రాజెక్ట్‌లో భాగస్వాములుగా ఉన్న ప్రైవేటు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పునరుద్ధరణ... యథావిధిగా రైళ్ల రాకపోకలు



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీ నగర్): రాజ మహేంద్రవరం సమీపంలో గూడ్స్ రైలు బుధవారం తెల్ల వారుజామున పట్టాలు తప్ప డంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విషయం విజయవాడలోని ఉన్న తాధికారులకు తెలియటంతో సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి వెళ్లి దాదాపు ఏడు గంటలకు మరమ్మతులు చేసి, ట్రాక్‌ను పునరుద్ధరించారు. దాంతో రైళ్ళ రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ఘటన తీవ్రస్థాయిలో ఉండటంతో ఒకే ట్రాక్‌పై రాకపోకలు కొనసాగించటంతో తొమ్మిది రైళ్లు రద్దు చేయడం, కొన్ని అలస్యంగా నడపటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజమండ్రి స్టేషన్ యార్డ్ వద్ద డౌన్ మెయిన్ లైన్ (విజయవాడ-విశాఖపట్నం లైన్)లో ఎన్ఎమ్‌జీ రేక్ ఎక్స్-వాలాజాబాద్ నుంచి కిద్దోర్‌పూర్ డాక్స్, కోలకట్ట నుంచి కార్లను తీసుకువెళుతున్న ఒక వ్యాగన్ రాజమండ్రి యార్డ్ వద్ద పట్టాలు తప్పింది. డీఆర్ఎం శివేంద్రమోహన్ తక్షణం స్పందించి ఆపరేషన్స్, ఆఫీసర్స్ టీమ్, ఇంజినీరింగ్, ఆపరేటింగ్, కమర్షియల్, సిగ్నలింగ్, ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో యార్డ్ వద్దకు చేరుకున్నారు. ఈ లైన్ గోల్డెన్ చతుర్భుజి క్లిష్టమైన ట్రంక్ రూట్‌లో పట్టాలు తప్పడంతో పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేశారు. పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షించడానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏడీఆర్ఎం డీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో విజయవాడలోని కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక అధికారుల బృందాన్ని నియమించారు. సమన్వయ కార్యాచరణ ప్రణాళికతో అధికారులు రైళ్లను క్రమబద్ధీకరిం చారు. చిక్కుకు పోయిన ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాజమండ్రి, సామర్లకోట,విజయవాడ స్టేషన్లలో ప్రయాణికుల కోసం ప్రత్యేక సహాయ/ ఎంక్వైరీ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. టికెట్‌లను రద్దు చేసుకున్న వారికి నగదు వాపసు కౌంటర్లు ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో జేసీబీ పాలన: లోకేశ్

విశాలాంధ్ర-తాడేపల్లి: ఏపీలో జేసీబీ పాలన నడుస్తోందని, వైసీపీ ప్రభుత్వ అధికారిక వాహనం జేసీబీ అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. బుధవారం తాడేపల్లిలోని ఇప్పటంలో ఆయన పర్యటించారు. ఇళ్ళు కూల్చి వేసిన ప్రాంతాలను పరిశీలించారు. బాధితు లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జగన్ విధ్వంసానికి బ్రాండ్ అంబాసిడర్ అని, కట్టడంరాదు, కూల్చడం ఒక్కటే వచ్చునన్నారు. టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు ఇంటి గోడ, సబ్బం హరం, గీతం యూనివర్సిటీ గోడలను కూల్చివేశారని, రోడ్డుకి అడ్డంగా గోడలు కట్టడం, ప్రతిపక్ష నాయకుల పంట తగలబెట్టడం, ప్రతిపక్ష నాయకుల ఇళ్లు కూల్చడం వీళ్లకు ఫ్యాషన్‌గా మారిపోయిం దన్నారు. జగన్ రెడ్డి మూడున్నర ఏళ్ల పాలనలో మొత్తం రాష్ట్రాన్నే కూల్చేశాడని, ఆళ్ల రామకృష్ణా రెడ్డి మూడున్నర ఏళ్లలో మంగళగిరిని కూల్చేశాడని ఆరోపించారు. అన్ని చోట్లా ఇళ్ల కూల్చివేతలకు వ్యతిరేకంగా టీడీపీ పోరాటం చేసిందని, న్యాయ సహాయం చేసి కొన్ని చోట్ల కూల్చివేతలు అడ్డుకోగలిగామని ఇప్పటంలో జరిగింది మరీ అన్యాయమన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే ఇక్కడ ఇళ్లు కూల్చేశారని, రోడ్డు మీద గుంతలు పూడ్చలేని చెత్త ప్రభుత్వం, రోడ్డు విస్తరణ అంటూ ఇళ్లు కూల్చడం విడ్డూరంగా ఉందన్నారు. జనసేన సభకి భూములు ఇచ్చారని, పోయిన ఎన్నికల్లో ఈ గ్రామంలో టీడీపీకి మెజారిటీ వచ్చిందనే కోపంతోనే ఇళ్లను కూల్చేశారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కమ్యూనిటీ హాల్‌ని మరింత అభివృద్ధి చేస్తామని, శ్రీకృష్ణదేవరాయ పేరు పెడతామని, చెరువు తవ్వి రూ.3 కోట్లు కొట్టేసిన వైసీపీ నాయకుల్ని చిప్పకూడు తినేలా చేస్తామన్నారు.

మానని నోట్ల రద్దు గాయాలు

సరిగ్గా ఆరేళ్ల కింద 2016 నవంబర్ 8న నరేంద్ర మోదీ ప్రభుత్వం చెప్పా పెట్టకుండా రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసింది. నల్ల ధనాన్ని వెలికి తీయడం, తీవ్రవాదానికి కళ్లెం వేయడం, అవినీతికి అడ్డుకట్ట వేయడం పెద్దనోట్ల రద్దు లక్ష్యం అని ప్రధానమంత్రి మోదీ రేడియో, టీవీల్లో హఠాత్తుగా ప్రత్యక్షమై ప్రకటించారు. ఈ నోట్లను మార్చుకోకపోతే అవి చిత్తు కాగితాల కిందే లెక్క అని మోదీ చెప్పారు. ఆ మరుసటి రోజు నుంచి జనం బ్యాంకుల ముందు పడిగాపులుపడి నోట్లు మార్చుకోవడానికి నానాయాతన పడ్డారు. ఈ క్రమంలో కనీసం 150 మంది మరణించారు. మోదీ ఒక్క కన్నీటిబొట్టు కూడా కార్చలేదు. పెద్దనోట్లను రద్దుచేయడం ద్వారా చెలామణిలో ఉన్న నోట్లు రిజర్వుబ్యాంకు దగ్గరకు చేరాయి. ఎన్ని నోట్లయితే చెలామణిలో ఉన్నాయనుకున్నారో అన్ని కొత్త నోట్లు చెలామణిలోకి వచ్చాయి. మరి నల్లధనం ఏది అన్నది మాత్రం ఇప్పటిదాకా తేలలేదు. మోదీ ప్రభుత్వం ఏదైనా పథకం ప్రవేశపెడ్తే ప్రతి సంవత్సరం అదే రోజు పెద్ద పండగ చేస్తుంది. తమ ఘనత చాటుకోవడానికి పత్రికలలో ప్రజాధనంతో వ్యాపార ప్రకటనలు గుప్పిస్తుంది. 2017 నుంచి 2022 నవంబర్ ఎనిమిది వరకు మోదీ ప్రభుత్వం ఆ విషయాన్ని ప్రస్తావించలేదు. కానీ పెద్దనోట్ల రద్దుచేసిన మరుసటి సంవత్సరం మోదీ సర్కారు నల్లధన వ్యతిరేక దినోత్సవం జరపడం మాత్రం మరిచిపోలేదు. నల్లధనం దాచుకున్న వారు ఆ ధనాన్ని నష్టపోయారు అని మాత్రం దండిగా ప్రచారం చేశారు. పెద్ద నోట్లను మార్చుకోవడానికి బ్యాంకుల దగ్గర ఏ పెద్ద ఆసామీ, ఏ అగ్ర నాయకుడూ కనిపించలేదు. అంటే నల్లధనాన్ని దాచుకున్నవారు బ్యాంకులకు వెళ్లకుండానే తమ పెద్దనోట్లను దొడ్డిదారిన మార్చుకున్నారనుకోవాలి. ఎంత మొత్తంలో పెద్దనోట్లు రిజర్వు బ్యాంకుకు తిరిగి వెళ్లాయో అంతే మొత్తంలో డబ్బు చెలామణిలోకి వచ్చింది. అంటే రిజర్వు బ్యాంకుకు చేరిన నోట్లలో ఒక్కనోటు కూడా నల్లది కాదన్న మాట. నల్లధనం నోట్లరూపంలో ఉంటుందన్నది మోదీ ప్రభుత్వం భ్రమ. నల్లధనంలో నగదురూపంలో ఉండేది ఒక్క శాతం కూడా ఉండదు. వ్యాపార లావాదేవీల్లో అనుసరించే అక్రమ పద్ధతులవల్ల పోగుపడే నల్లధనాన్ని నోట్ల రద్దు ఏమాత్రం నివారించలేక పోయింది. పెద్ద నోట్ల రద్దు మోదీ ప్రభుత్వం కన్నా ముందు కూడా ఒకటి రెండు సార్లు అమలైంది. అప్పుడు చెలామణిలో ఉన్న పెద్ద నోట్లే తక్కువ. వెయ్యిరూపాయల నోట్లను కళ్లతో చూసినవారు అతి కొద్దిమంది. అందువల్ల జనంపై ఆ నోట్లరద్దు ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. కానీ 2016నాటి నోట్లరద్దు ప్రతి వ్యక్తిని దెబ్బ తీసింది. పోనీ పెద్ద నోట్ల రద్దువల్ల డబ్బు చెలామణి తగ్గిందా అంటే అదీ లేదు. అప్పుడు రూ. 17.7 లక్షల కోట్లు చెలామణిలో ఉన్నాయనుకుంటే ఈ ఆరేళ్ల కాలంలో డబ్బు చెలామణి 72శాతం పెరిగి రూ.30.88 లక్షల కోట్లకు చేరింది. అంటే ఎడాపెడా నోట్లు ముద్రిస్తున్నారు. రద్దుచేసిన 500 నోట్ల స్థానంలో కొత్తనోట్లు వచ్చాయి. వెయ్యి నోట్లు కొత్తవి రాలేదు కాని రెండు వేల రూపాయలు భారీ స్థాయిలో ఇప్పుడు చెలామణిలో ఉన్నాయి. నోటు విలువ ధనం నల్లదో తెల్లదో తేలడానికి ఉపకరించే అంశం కాదు.

నోట్లను రద్దు చేయడానికి సాధారణంగా రిజర్వు బ్యాంకు సిఫార్సు చేస్తే ప్రభుత్వం దాన్ని పరిశీలించి ఓ నిర్ణయానికి వస్తుంది. కానీ మోదీ రిజర్వు బ్యాంకుకు ఏ మాత్రం సంబంధం లేకుండా నిర్ణయం తీసుకుని జనం మీద రుద్దేశారు. నిజానికి ఆయన మంత్రివర్గానికి కూడా నోట్లురద్దు చేస్తున్నట్టు మోదీ ప్రకటించిన తరవాతే తెలిసింది. అప్పటి ఆర్థికమంత్రి అరుణ జైట్లీకి కూడా ఈ నిర్ణయంతో సంబంధం లేదు. అంటే విధాన నిర్ణయాల్లో కూడా మోదీది నిరంకుశత్వమే. పెద్ద నోట్లరద్దు అవ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్న వారిని కష్టాలపాలు చేసింది. చిన్న, మధ్యతరగతి వ్యాపారులను కోలుకోలేని దెబ్బతీసింది. మన దేశంలో అవ్యవస్థీకృత రంగంలో పనిచేస్తున్న వారే 94 శాతం ఉన్నారు. వీరికే తీవ్ర విఘాతం కల్గింది. చేతిలో డబ్బు ఆడనందువల్ల చిన్న, మధ్య తరగతి వ్యాపారులు చాలా ఇబ్బందిపడ్డారు. కొందరైతే ఈ వ్యాపారాలు మానుకోవలసి వచ్చింది. ఇలాంటి వ్యాపారాలు పరిస్థితి కుదుటపడ్డ తరవాత పుంజుకోవడానికి ఉండే అవకాశం చాలా తక్కువ. ఇలా వ్యాపారాలు కోల్పోయినవారు ఉపాధికోసం యాతనపడ్డారు. నోట్ల రద్దు నిరుద్యోగాన్ని పెంచింది. మన స్థూల జాతీయోత్పత్తిని లెక్కకట్టే విధానమే లోపభూయిష్టమైంది. ఆ లెక్కలకు వ్యవస్థీకృత రంగమే ప్రధానాధారం. ఆర్థికాభివృద్ధి పుంజుకుంటోందన్న దశలో మోదీ నోట్లరద్దుతో దెబ్బ తీశారు. ఆ తరవాత వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.) సమ్మెట పోటైంది. నోట్లు రద్దయిన తరవాత నోట్ల కొరత రెండు మూడునెలలు తీవ్రంగానూ, ఏడాదిపాటు ఓ మోస్తరుగానూ కొన సాగింది. ప్రభుత్వ దిక్కూ దిశాలేని విధానం జనాన్ని ఇబ్బందుల పాలు చేసింది. పెద్దనోట్లరద్దు తరవాత 2017-18లో ఆర్థికాభి వృద్ధి రేటు 8శాతం ఉంటే 2019-20లో అది 3.1 శాతానికి పడిపోయిందని అధికారికలెక్కలే చెప్తున్నాయి. అవ్యవస్థీకృత రంగం పరిస్థితి ఆర్థికాభివృద్ధి అంచనాల్లో అంతగా ప్రతిఫలించదు. వ్యవస్థీకృత రంగం లోనూ అభివృద్ధి కుంటుపడడానికీ పెద్దనోట్ల రద్దు అనే తప్పుడు విధానమే కారణం.

పెద్దనోట్లరద్దు గురించి వాస్తవాలు బయటపెట్టాలని సమాచార హక్కు కింద ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నా మోదీ సర్కారు చలించ లేదు. దానికి సంబంధించిన పత్రాలను వెల్లడించలేదు. పెద్దనోట్ల రద్దు తరవాత దాదాపు నెలరోజులకే ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టులో సవాలుచేశారు. 2016 డిసెంబర్‌లోనే ఈ కేసును అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించారు. కాని విచారణ కొనసాగలేదు. ఆ కేసు బుధవారం నాడే విచారణకు వచ్చింది. సాధారణంగా విధాన నిర్ణయాలపై కోర్టులు తీర్పులు చెప్పవు. న్యాయమూర్తి నజీర్ నాయకత్వంలోని అయిదుగురు న్యాయ మూర్తుల బెంచి నోట్లరద్దు రాజ్యాంగంలోని 300ఎ అధికరణానికి విరుద్ధమైందో కాదో తేల్చాల్సి ఉంది. ఈ అధికరణం ప్రకారం ఏ వ్యక్తి ఆస్తిని లేకుండా చేయడం కుదరదు. ఏకపక్షంగా ప్రభుత్వానికి నోట్లు రద్దుచేసే అధికారం ఉందో లేదో సుప్రీంకోర్టు తేల్చాల్సి ఉంది. ఏమైతేనేమి నోట్లరద్దు గాయాలు ఆరేళ్లకుకూడా మానలేదు.

ఆశానిరాశల కలగలుపు

తండ్రీ కొడుకులిద్దరూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు కావడం విశిష్టతే. యశ్వంత్ విష్ణు చంద్రచూడ్ 44 ఏళ్ల కిందట సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఏడేళ్లు పని చేశారు. సుప్రీంకోర్టు చరిత్రలో ఏడేళ్లు ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగింది ఆయనొక్కరే. ఆయన కుమారుడు ధనుంజయ్ యశ్వంత్ చంద్రచూడ్ 40వ ప్రధాన న్యాయమూర్తిగా బుధవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. తండ్రి వై.వి.చంద్రచూడ్‌గా ప్రసిద్ధులైతే ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్‌గా ప్రసిద్ధుడు.

యశ్వంత్ విష్ణు చంద్రచూడ్

న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ తండ్రికి తగ్గ కొడుకే కాదు. కొన్ని సందర్భాలలో తండ్రిని మించిన కొడుకునని నిరూపించుకున్నారు. కనీసం రెండు సందర్భాలలో తండ్రి ఇచ్చిన తీర్పులను తిరగతోడారు. 2016 మే 13 నుంచి డి.వై.చంద్రచూడ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. ఆయన ఇచ్చిన అనేక తీర్పులు చాలా విశిష్టమైనవి. అయోధ్య భూవివాదం, శబరిమల, వ్యక్తుల గోప్యతకు సంబంధించి ఆయన తీర్పులు చెప్పారు. అయోధ్య వ్యవహారంలో మాత్రం ఆయన తీర్పు చాలా మందికి నిరాశనే

మిగిల్చింది. ఈ తీర్పు అంతకుముందు అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కన్నా మెరుగైందిగా లేదు. అసలువిషయం తేల్చకుండా ఆ స్థలాన్ని హిందువులకు అప్పగించారు. సాధారణంగా న్యాయ పరిభాష సామాన్యులకు అర్థంకాని రీతిలోనే సంక్లిష్టంగా ఉంటుంది. కానీ న్యాయసంబంధమైన రాతలు గందరగోళాన్ని పెంచేవిగా ఉండకూడదని డి.వై.చంద్రచూడ్ అంటారు. అంటే కోర్టు వ్యవహారాలు జనానికి అర్థంకావాలన్న ప్రజాస్వామ్య దృక్పథం ఆయనకు ఉన్నట్టే. మనంచెప్పే తీర్పులు, రాసేరాతలు ఎవరిమీదైతే ప్రభావం చూపుతాయో వారికి అర్థంకావాలిగా అన్నది ఆయన అభిప్రాయం. న్యాయమూర్తులకు వారి రంగంలో పాండిత్యం ఉండవలసిందే కానీ దాన్ని ప్రదర్శించవలసిన అగత్యం లేదు. అర్థం కాని తీర్పువల్ల అనర్థమేనంటారు న్యాయమూర్తి చంద్రచూడ్.

పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తి యు.యు.లలిత్ కేవలం 74 రోజులు మాత్రమే ఆ పదవిలో ఉన్నారు. అంతకు ముందు 22వ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న కమల్ నారాయణ్ సింగ్ అయితే కేవలం 17 రోజులే ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఈ దృష్టితో చూస్తే ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తికి సరిగ్గా రెండేళ్ల పదవీ కాలం ఉంటుంది. తగినంత పదవీ కాలం ఉంటే తమ ముద్ర వేయడానికి అవకాశం ఉంటుంది. న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ వ్యక్తిత్వాన్నిబట్టి చూస్తే వచ్చే రెండేళ్ల కాలంలో ఆయన ముద్ర కచ్చితంగా కనిపించవచ్చు. "నా పనితీరే నేనేం చేస్తానో చెప్తుంది" అని ప్రమాణ స్వీకారం తరవాత డి.వై.చంద్రచూడ్ చెప్పారంటే ఆయనలో ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతోందనుకోవాలి. సామాన్య మానవుడికి తోడ్పడడమే తన కర్తవ్యం అని కూడా ఆయన చెప్పారు.

ఆధార్ పథకం, శబరిమల వ్యవహారం, లైంగిక సంబంధాలు, ప్రధానంగా స్వలింగుల మధ్య లైంగిక సంబంధాలను నేరంగా పరిగణించ కూడదనీ అవివాహిత మహిళలకు గర్భవిచ్ఛిత్తికి ఉన్న హక్కు గుర్తించడం మొదలైన అంశాల్లో ఆయన ఇచ్చిన తీర్పులు విశిష్టమైనవే. కరోనా మహమ్మారి పంజా విసిరిన సమయంలో కూడా ఆయన తీర్పులు జనానికి ఊరట కల్గించాయి. ప్రజల హక్కులకు భంగం కలగకుండా చూడాలన్న సంకల్పం న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌కు ఉన్నప్పటికీ రాజకీయపరంగా కొన్ని కీలకాంశాలలో, న్యాయమూర్తి లోయా విషయంలోనూ ఆయన ప్రదర్శించిన వైఖరి నిరాశనే మిగిల్చింది. హాదియా అనే అమ్మాయి ప్రేమ వివాహం చేసుకుంటే జాతీయదర్యాప్తు సంస్థకు ఆ వ్యవహారం అప్పగిస్తూ న్యాయమూర్తి కేహార్‌తో కూడిన బెంచిలో ఉన్న చంద్రచూడ్ తీర్పుచెప్పడం చివరకు ఇబ్బందికరంగా పరిణమించింది. బీసీసీఐలో అమిత్‌షా కుమారుడు జే షా పదవీ కాలాన్ని పొడిగించడానికి అంగీకరించడం చూస్తే న్యాయమూర్తి చంద్రచూడ్ రాజకీయవాసన ఉన్న కేసుల్లో వెనుకడుగు వేస్తారన్న అభిప్రాయం కలుగుతుంది. పన్నులకు, నేరాలకు సంబంధించిన విషయాల్లోనూ ఆయన యథాతథ వాదిగానే కనిపిస్తారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితి భయానకంగా ఉంది. కార్యనిర్వాహకవర్గం అత్యంత శక్తిమంతంగా తయారైంది. నిరంకుశ ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అసలు ప్రజాస్వామ్యానికే ప్రమాదం ముంచుకొచ్చే స్థితిలో ఉన్నాం. అలాంటప్పుడు అత్యున్నత న్యాయస్థానంలో అగ్రసనాధిపతి నిర్మొహమాటంగా వ్యవహరించవలసిందే. కానీ చంద్రచూడ్ అలాంటి సందర్భాలలో వెనుకడుగే వేశారనిపిస్తుంది. ఇది ఆయన స్వభావానికి పరిమితమైంది కాదు. ప్రజాస్వామ్య మనుగడకే సవాలు. 2017లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి కేహార్ పదవీ విరమణ చేసిన దగ్గరనుంచి సుప్రీంకోర్టులో ప్రమాణాలు పడిపోతున్నాయన్న అనుమానం కలుగుతోంది.

న్యాయమూర్తి చంద్రచూడ్ గొప్ప మేధావి. న్యాయమూర్తిగా చాలా విశిష్టమైన లక్షణాలు ఉన్న వారు. వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇస్తారు. శబరిమల ఆలయాన్ని అన్ని వయసుల వారు సందర్శించవచ్చునని చెప్పడం నిజంగా చంద్రచూడ్ చెప్పిన చరిత్రాత్మకమైన తీర్పే. అసమ్మతి వ్యక్తం చేయడానికి ఉన్న హక్కుని కూడా ఆయన గుర్తిస్తారు. అరెస్టే శిక్ష కాకూడ దంటారు. మానవహక్కుల పరిధిని విస్తరించే తత్వం ఉన్న న్యాయమూర్తి చంద్రచూడ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడవలసి వచ్చినప్పుడు ఆ స్వభావం అంతగా కనిపించడం లేదేమోననిపిస్తుంది.

-అనన్య వర్మ

ఇది పెద్ద మోసం మోదీజీ

నిత్య చక్రవర్తి

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవేముంది అన్న సామెతను ప్రధాని మోదీ అనేక విషయాలలో రుజువు చేస్తున్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా ఎవరి నుండి ఎంత సేకరిస్తున్నారన్న విషయం ఎవరికీ తెలియదు. మోదీ పాలనలో పారదర్శకత కనిపించదు. ఈ బాండ్లు కొనుగోలు చేసేవారు కూడబెట్టేది నల్లధనం. ఎందుకంటే ఈ డబ్బు పన్ను చెల్లించనిదే అయివుంటుంది. ఈ ధనం సేకరించడం చట్టబద్ధమైన అవినీతి కాదా? ఈ బాండ్ల వ్యవహారం కోర్టుకు వెళ్లింది. త్వరలో విచారణ జరగనున్నది. హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్‌లలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ తరుణంలో మోదీ ప్రభుత్వం అత్యంతగా దిగజారిపోయి మరిన్ని నిధులను పాలక బీజేపీ కోసం పోగేసేందుకు ఎన్నికల బాండ్ల పథకంలో సవరణలు చేసింది. హిమాచలప్రదేశ్‌లో నవంబరు 12, గుజరాత్‌లో డిసెంబరు 1న, 5న ఎన్నికలు జరుగుతాయి. 8వ తేదీన ఫలితాలు వెల్లడవుతాయి. వారం రోజులు బాండ్లు కొనుగోలుకు, బాండ్లను నగదుగా మార్చుకునేందుకు వీలుగా సవరణలు చేశారు.

2017లో ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్లపై విచారణ సుప్రీంకోర్టులో పెండింగ్‌లోఉన్న సమయంలో సవరణలు అత్యంత దుర్మార్గం. బాండ్ల దార్వరా వచ్చే మొత్తంలో 75 శాతానికి పైగా బీజేపీ అకౌంట్‌లోకే వెళు తున్నాయి. న్యాయనిపుణులు ఛాలెంజ్ చేయగా, ఎన్నికల కమిషన్ సందేహాలు వ్యక్తం చేసింది. తప్పితే అడ్డుకొనేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు ఎన్నికల బాండ్ల ద్వారా పోగేసే నల్లధనమంతా ఓటర్లకు పంపిణీ చేసి ఓట్లువేయించుకుని గెలుపొందడమే బీజేపీ లక్ష్యమని, అందుకు మోదీ ప్రభుత్వం సహకరిస్తుందన్న అభిప్రాయం ఎల్లెడలా ఉంది. కోర్టులో విచారణ జరగనున్న సందర్భంలో అదనంగా ధనం సేకరించడం మోడల్ కోడ్‌ను ఉల్లంఘించినట్లు కాదా? ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం దగ్గరనుండి కమిషన్ అన్ని విధాలుగా మోదీ ప్రభుత్వానికి సహకరిస్తుందన్న అపప్రదను అది మూటకట్టుకున్నది. బాండ్ల విక్రయానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సోమవారం నోటీసు జారీ చేసింది. నవంబరు 9నుంచి 15వ తేదీ వరకు బాండ్లను విక్రయిస్తారు.

కార్పొరేట్లు తమకు మోదీ ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని బాండ్లు కొనుగోలు చేస్తాయి. ఆ వెంటనే రాజకీయ పార్టీలు నగదును ఎస్‌బీఐ నుంచి తీసుకొని వాడుకోవచ్చు. 2018 జనవరిలో ఎన్నికల బాండ్లను కేంద్రం ప్రవేశపెట్టింది. జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబరు నెలల్లో పదిరోజుల పాటు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేయవచ్చు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 30 రోజులు కొనుగోలుచేసే వీలు కల్పించారు. ఇప్పుడు కొత్త సవరణ ద్వారా ఈ ఏడాది నవంబరులోనూ కొనుగోలుకు కేంద్రం అనుమతించింది. 2022 జులైలో బాండ్ల ద్వారా మొత్తం 10,246 కోట్ల విరాళాలు లభించాయి. అక్టోబరులో ఎంత లభించిందన్న వివరాలు ఇంకా వెల్లడికాలేదు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో బీజేపీకి 75 శాతం నిధులు అందాయి.

గత నాలుగేళ్ల కాలంలో కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అస్థిరీకరించేందుకు, గోవా, మణిపూర్‌లలో తమ ప్రభుత్వాలను ఏర్పాటుకు ఎంఎల్‌ఏల కొనుగోలుకు బీజేపీ వందలకోట్లు ఖర్చు చేసింది. అలాగే మహారాష్ట్రలో శివసేనలో చీలికలు తెచ్చి అక్కడి మహా అఘాడిఫ్రంట్ ప్రభుత్వాన్ని పడగొట్టి, ఏక్‌నాథ్ షిండే సహా అనేకమంది ఎంఎల్‌ఏల కొనుగోలు చేయడానికి దాదాపు 200 కోట్లు ఖర్చు చేసినట్లు అభిజ్ఞవర్గాలు తెలిపాయి. ఉద్ధవ్ థాక్రే నాయకత్వంలోని శివసేనలో చీలికలు తెచ్చి షిండే నాయకత్వంలోని ఎంఎల్‌ఏలు, బీజేపీ ఎంఎల్‌ఏలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ చేస్తున్న ఇలాంటి చర్యలు వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అస్థిరపరచడంపై కేంద్రీకరించాయి. ఐదు ఎన్నికల ట్రస్టులు ఇచ్చిన మొత్తం విరాళాల్లో 2021-22లో 72శాతం అంటే రూ.481 కోట్లు బీజేపీకి అందగా కాంగ్రెస్‌కు 3.8శాతం మాత్రమే లభించాయి.

బాండ్లు కొనుగోలు, ఎన్నికల ట్రస్టులకు విరాళాలు ఇచ్చేవారు పాలకపార్టీని వ్యతిరేకం చేసుకోవడం ఎందుకని ఆలోచిస్తారు. ఇవ్వని వాళ్లపై కేసుల పేరుతో ఐటీశాఖ సీబీఐ, ఈడీలను ఉసిగొల్పి దాడులు చేయిస్తారు. దేశ కార్పొరేట్ల ప్రయోజనాలు పొందుతున్నప్పటికీ ఈ ప్రభుత్వంతో తలగోక్కోవడం ఎందుకని ఆందోళన పడుతున్నారు. భవిష్యత్‌లో రిస్క్ తీసుకోవడం ఎందుకని ఆయా పరిశ్రమల యువనాయకత్వం కూడా మౌనంగా బీజేపీ కోరినట్లు నడుచుకుంటున్నారు. ఫలితంగా ఎన్నికల్లో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు లేవు. ఇతర ప్రధాన పార్టీల కంటే పదిరెట్లు అదనంగా నిధులు బీజేపీకి చేరుతున్నాయి. అయినా అవినీతిని సహించబోనని మోదీ నినాదం ఇస్తూనే ఉంటారు. గత ఎనిమిదేళ్లపాలనలో కార్పొరేట్ రంగం అసాధారణంగా సంపదను చేజిక్కించుకున్నది. దేశంలో 20 అత్యధికంగా లాభాలు పొందే పరిశ్రమలు 1990లో మొత్తం కార్పొరేట్లు పొందిన లాభాల్లో 14శాతం దక్కించుకున్నాయి. అలాగే వీరు 2010లో 30శాతం, 2019లో 70శాతం లాభాలు పొందారని ఇటీవల జరిపిన అధ్యయనం తెలియజేసింది.

మోదీ మొదటి ఐదేళ్ల పాలనలోనే కార్పొరేట్ల వద్ద అపారమైన సంపద కేంద్రీకృతమైంది. గడిచిన మూడేళ్లలో వీరి వద్ద సంపద ఊహించలేనంతగా పెరిగింది. వీరంతా బాండ్లు కొనడం, భారీగా విరాళాలివ్వడానికి వెనుకాడరు కదా! ఇచ్చిపుచ్చుకొనే విధానాన్ని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా పకడ్బందీగా అమలు చేస్తున్నారు. దేశ ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ అంతం కావడానికి మొత్తం ప్రతిపక్షాలు ప్రజాస్వామ్యం కోరుకుంటున్న ప్రజలు ముందుకువచ్చి ఆశ్రిత పెట్టుబడీదారీ విధానాన్ని అంతం చేయాలి. బాండ్ల పథకంలో సవరణలు చేసి నిధులు సమీకరించే ప్రభుత్వ విధానాన్ని నిలిపివేయడం సవాలుగా తీసుకొని పనిచేయాలి.

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఉచిత వైద్యం అందించాలి

తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు, లేదా వారి కుటుంబ వైద్యచికిత్సకు ప్రయివేటు ఆసుపత్రులకు, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు వెళితే 30,40 లక్షల రూపాయల వరకు ఆసుపత్రుల చార్జీలు, మందులకు ఖర్చు చేయాల్సి వస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రెండు లక్షల రూపాయల లోపు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద ఇస్తుంది. ఆ రెండు లక్షల రూపాయల లోపు కూడా ఆదాయం పన్నులో చూపించాలని నిబంధనలు పెడ్తున్నారు. లక్షలకు లక్షలు ఏ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల దగ్గర ఉండవు. ప్రాణాలను కాపాడుకోవడానికి ఆస్తులను, బంగారం తాకట్టు పెట్టి లేదా తెలిసిన బంధుమిత్రుల దగ్గర వడ్డీకి తెస్తే ఖర్చు పెట్టిన రూపాయి ఇవ్వకుండా దానిని ఆదాయం కింద పరిగణించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు జారీ చేసిన హెల్త్ కార్డులు ప్రయివేట్, కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులలో ఎక్కడా పనిచేయడంలేదు. అనారోగ్యానికి గురైనప్పుడు ఆసుపత్రులకు వెళ్లి హెల్త్ కార్డులు చూపిస్తే ఇవి దేనికీ పనికి రావని, డబ్బులు చెల్లించి రీ యంబర్స్‌మెంట్ చేసుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నారు.

నగదు రహిత వైద్యం జీ.వో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, గెజిటెడ్ అధికారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి హరీష్ రావును కలిసి నగదు రహిత వైద్యాన్ని అందించాలని కోరారు. పీఆర్సీ కమిటీ రికమండేషన్ చేసినట్లు బేసిక్ పే నుంచి ఒక్క శాతం హెల్త్ స్కీం కింద ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని లేకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు అన్ని ప్రయివేటు, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లలో నగదు రహిత వైద్యాన్ని అందించాలని కోరితే వెంటనే జీఓ విడుదల చేస్తామని హామీ ఇచ్చి నెలలు గడిచినా నగదు రహిత వైద్యాన్ని అందించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు ఉపయోగపడే జీఓ ఇప్పటికైనా విడుల చేయాలని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంపూర్ణ ఆరోగ్యం ఉండేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చిన్న జ్వరం వచ్చి ఆసుపత్రికి వెళితే రక్తపరీక్ష, స్కానింగ్, ఎక్స్ రే, ఈ.సి.జి.టి.ఎం.టి, ప్లేట్ రేట్ కరోనాటెస్ట్ అంటూ లేనిపోని టెస్టులు రాసి లక్షలకు లక్షలు వసూలు చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు అప్పుల పాలు చేస్తున్నారు.

నకిలీ డాక్టర్లు

రాష్ట్రంలోని 33 జిల్లాలలో కొంత మంది డాక్టర్ల అవతారం ఎత్తి అనేక మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. కొందరు ఆర్.ఎం.పిలు, మెడికల్ దుకాణాల యజమానులు, ఫార్మసీ చేసిన విద్యార్థులు నార్వే, ఉక్రెయిన్, రష్యా మిగతా విదేశాల్లో చదవనప్పటికి ప్రజలకు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వైద్యం వికటిస్తే నగరంలోని ప్రయివేటు, స్పెషాలిటీ ఆసుపత్రులకు పంపుతున్నారు. ప్రతిరోగి వైద్యంలో అయ్యే చార్జీలలో కనీసం 30 శాతం నుండి 50 శాతం వరకు రోగిని ప్రయివేటు, స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు పంపిన వారికి చెల్లిస్తున్నట్లు బాహాటంగానే వైద్యులు అంగీకరిస్తున్నారు. విదేశాల్లో చదివిన డాక్టర్‌లు వారి పేరు కింద డిగ్రీలు రాయకుండానే అన్ని ఆపరేషన్‌లు చేస్తూ లక్షలకు లక్షలు సంపాదిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన వారు ఇక్కడి మెడికల్ కౌన్సిల్‌వారు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తర్వాతనే వైద్య వృత్తిని ప్రారంభించాలి.

ప్రతి డాక్టర్ తాను ఏమి చదివారో, వారు ఎందులో స్పెషలైజేషన్ చేసారో తెలియజేస్తూ బోర్డులు పెట్టాలనే నిబంధనలు ఉన్నా దానిని ఎవ్వరూ పట్టించుకోవటం లేదు. కొంత మంది డాక్టర్లు 20 మందికి మాత్రమే చూస్తామని, 20 మందికి టోకెన్లు జారీ చేస్తామని వారు మాత్రమే డాక్టర్ల దగ్గర చూపించుకోవడానికి అర్హులని చెప్పి సెల్‌ఫోన్‌లు స్విచ్‌ఆఫ్‌లో పెట్టడం, సెల్‌ఫోన్ కలిస్తే టోకెన్లు అయిపోయాయని చెప్తూ ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి మాత్రమే టోకెన్లు జారీ చేస్తున్నారు. కడుపు నొప్పి, కిడ్నీలో రాళ్లు, తలనొప్పి, మెడ నొప్పి, కంటి సమస్యలతో డాక్టర్‌ల దగ్గరికి వెళ్తే టోకెన్‌ల సిస్టం అని టోకెన్లు అయిపోయాయని చెప్తే ఏమి చేయాలో తెలియని అగమ్యగోచరంగా తయారవుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గానీ వైద్య విధాన పరిషత్, లేదా వైద్య సంబంధ అధికారులు జోక్యం చేసుకొని నకిలీ డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గానీ, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు గాని, వైద్య సంబంధిత అధికారులు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు నగదురహిత వైద్యాన్ని అందించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రయివేటు, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లలో హెల్త్ కార్డులు చెల్లుబాటు అయ్యేటట్లు ఉత్తర్వులు జీ.వో జారీ చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు కోరుతున్నారు.

డాక్టర్.ఎస్. విజయ భాస్కర్
సెల్: 9290826988

శాస్త్రీయ దృక్పథం పెంచాలి

అంతర్జాతీయ సైన్సు దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 10వ తేదీన జరుపుకుంటున్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణానికి, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంచేందుకు ఈ సైన్సుదినోత్సవాన్ని ప్రభుత్వం ఉపయోగించుకోవచ్చు. ప్రపంచశాంతి, అభివృద్ధికోసం ప్రపంచ వ్యాప్తంగా ఈ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన అవసరం ఎంతైనావుంది. సైన్సు వలన సమాజానికి జరిగే అభివృద్ధిని ప్రజలకు అందించాలి. సైన్సు రుజువుకోరు తుంది. ఎవరో చెప్పారనో, పాత గ్రంథాలలో ఉన్నదని చెప్పడాన్ని సైన్సు అంగీకరించదు. పౌరులు అందరు ఈ సైన్సు స్ఫూర్తిని అవగాహన చేసు కుంటూ ముందుకు పోవాలి. ప్రతిపౌరునికి శాస్త్రీయ స్ఫూర్తిని, ప్రశ్నించే తత్వాన్ని, మానవ వాదాన్ని పెంచుకోవాలని రాజ్యాంగం ఆర్టికల్ 51లో 1976లో అప్పటిప్రధాని ఇందిరాగాంధీ 42 రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచింది. ఈ తరహా పౌర విధులను నిర్దేశించిన దేశం మనది ఒక్కటే. సైన్సు అభివృద్ధిచెందితే మూఢ నమ్మకాలు తొలగిపోతాయి. గ్రహణాల పట్ల ప్రజలలో చాలా మూఢనమ్మకం ఉంది. రాహుకేతువులు సూర్యచంద్రులను మింగుతాయని, అందువలన గ్రహణాలు ఏర్పడు తాయని పురాణాలలో చెప్పినదాన్ని ప్రచారం చేసుకుని, కొంతమంది దీన్ని బతుకు దెరువుకి ఉపయోగించు కుంటున్నారు. సైన్సు దినోత్సవం ముఖ్యఉద్దేశం ఇలాంటి ఛాందసభావాలను తొలగించి, ప్రజలను చైతన్యం చేయటమే!! ప్రధానులు, ముఖ్యమంత్రులు, అధికారులు మూఢ నమ్మకాలను పెంచి పోషిస్తున్నారు. సైన్స్‌ను ప్రమోట్ చెయ్యవలసిన దేశప్రధాని, ఒక సైన్సు కాంగ్రెసు సదస్సులో వేదకాలంలోనే విమానాలు న్నాయని, పురాణాలలో శివుడు వినాయకుని తలనరికి, మరల ఏనుగు తలను అతికించటాన్ని, ఈరోజుల్లో జరిగే సర్జరీలతో పోల్చి చెప్పటం అయన అజ్ఞానానికి నిదర్శనం.

నార్నె వెంకటసుబ్బయ్య

బీజేపీని హడలెత్తిస్తున్న యాపిల్ రైతు

- '1993' ఫలితాలు పునరావృతమవుతాయా?
- యాపిల్ రైతులపైనే కాంగ్రెస్ ఆశలు
- హామీల అమలే ప్రధాన సమస్య: ఎస్‌కేఎం

చండీగఢ్: హిమాచల్ ప్రదేశ్‌లో యాపిల్ సాగుదారుల అసంతృప్తి, దశలవారీ సమ్మె అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 1993లో ఇదే తరహా ఆందోళన కారణంగా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కూలిపోయింది. మరోమారు అదే తరహా ఫలితాలొస్తాయన్న ఆశలు కాంగ్రెస్ పార్టీలో ఉన్నాయి. అయితే కేవలం హామీలు గుప్పించడం మాత్రమే కాదు, ఎవరు అమలుచేస్తారనేది తమముందున్న ప్రధాన ప్రశ్న అని రైతు నాయకులు చెపుతున్నారు. ఇన్‌పుట్ వ్యయం కోవిడ్ తర్వాత రెండితలు పెరగడం తమను ఇబ్బందులపాలు చేసిందని, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం లభించకపోవడం ఆందోళనకు కారణమని వారు చెబుతున్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్‌వ్యాప్తంగా యాపిల్ సాగుదారులు సమ్మె కొనసాగిస్తూనే ఉండటంతో ఈసారి ఎన్నికల్లో తమ సమస్యలపై పార్టీలు దృష్టిని కేంద్రీకరిస్తున్నట్లు ఎస్‌కేఎం నేత సంజయ్ చౌహాన్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు ఈ నెల 12న జరగనున్నాయి. 10వ తేదీకి పార్టీల ప్రచారం ముగుస్తుంది. ఓట్ల లెక్కింపు డిసెంబరు 8న జరుగుతుంది. బీజేపీకి కాంగ్రెస్‌కు మధ్య హోరాహోరీ పోటీ ఉండనుంది. రాష్ట్రంలో సోలర్, సిర్మౌర్, కుల్లు, మండీ జిల్లాలు ముఖ్యంగా సిమ్లాలోని 18-20 నియోజకవర్గాలలో రైతులకు రాజకీయంగా పట్టు ఉంది.

హిమాచల్ ప్రదేశ్‌లో 1993 నాటి ఫలితాలు మరోమారు వెలువడేందుకు అవకాశం ఉందా అన్న ప్రశ్న ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఉన్నది. బీజేపీ పాలనతో విసిగిపోయిన యాపిల్ సాగుదారుల మద్దతు లభిస్తే రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలమని కాంగ్రెస్ ఆకాంక్షిస్తోంది. 1993 ఎన్నికలప్పుడు బీజేపీ ప్రభుత్వం కూలడానికి యాపిల్ రైతుల ఉద్యమమే కారణం. దీంతో యాపిల్ సాగుదారులపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకున్నది. ఇదే క్రమంలో మేనిఫెస్టోలో యాపిల్ రైతుల ఆదాయాన్ని పెంచుతామని హామీనిచ్చింది. పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరిస్తామనీ వాగ్దానం చేసింది. యాపిల్ సాగుదారులే సభ్యులుగా హార్టికల్చర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని, కమిషన్ సిఫార్సుల ఆధారంగా యాపిల్ రకాలకు ఎంఎస్‌పీని నిర్ణయిస్తామని తెలిపింది. అదానీ కంపెనీ వచ్చినా ఎంఎస్‌పీ కంటే తక్కువకు సాగుదారు నుంచి యాపిల్ కొనుగోలు చేసేందుకు మార్కెట్ వర్గాలకు అనుమతి ఉండబోదని కాంగ్రెస్ హామీనిచ్చింది.

హిమాచల్ మార్కెట్ నుంచి యాపిల్ సేకరించే ప్రధాన సంస్థల్లో అదానీ అగ్రీ ఫ్రెష్ ఒకటి కాగా అదానీ గ్రూపు నుంచి కనిష్ఠ సేకరణ ధర లభిస్తుండటంతో సాగుదారులు అసంతృప్తిగా ఉన్నారు. వారు వరుసగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఆగస్టులో రాష్ట్రంలోని అదానీ గ్రూపు కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహించారు. కనిష్ఠ సేకరణ ధరలు, ఇన్‌పుట్ వ్యయం పెంచడం, ఆదాయం తగ్గడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్యాకేజింగ్ సామాగ్రిపై జీఎస్టీని 12శాతం నుంచి 18శాతానికి పెంచడాన్ని నిరసించారు. 1990లో ఇదే తరహా ఆందోళన జరిగిన పర్యవసానంగా 1993 ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని శాంత కుమార్ ప్రభుత్వం కూలింది.

మరోవైపు బీజేపీ తమ మేనిఫెస్టో ద్వారా సాగుదారుల ఆందోళనలకు పరిష్కారం చూపగలిగామని, పరిస్థితి నియంత్రణలోనే ఉన్నదని భావిస్తోంది. యాపిల్ ప్యాకేజింగ్ సామ్రాగికి 12శాతంకంటే ఎక్కువ జీఎస్టీ కట్టాల్సిన అవసరం లేదని, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్)ను యాపిల్‌తో పాటు ఇతర పండ్లకు వర్తింపజేసి వాటి సాగుదారులకు లాభాలొచ్చేలా చూస్తామని బీజేపీ పేర్కొంది. యాపిల్ ధర తగ్గినప్పుడు ఈ పథకంతో లాభముంటుందని తెలిపింది.

బీజేపీ మేనిఫెస్టోపై హిమాచల్‌ప్రదేశ్ ఏఐసీసీ ఇంచార్జీ రాజీవ్ శుక్లా స్పందించారు. 'ఇది మరొక జుమ్లా (జిమిక్కు)' అని ఎద్దేవా చేశారు. బీజేపీ ముందుగా తమ ఐదేళ్ల పాలనపై నివేదిక ఇవ్వాలన్నారు.

ప్రతిపక్ష నేత ముకేశ్ అగ్నిహోత్రి మాట్లాడుతూ యాపిల్ సాగుదారుల డిమాండ్ల విషయంలో బీజేపీకి సున్నితత్వం లోపించింది.. ఫలితంగా ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. బీజేపీ ప్రభుత్వానికి, అదానీ గ్రూపుకు వ్యతిరేకంగా నిరసనలకు నేతృత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కో-కన్వీనర్ సంజయ్ చౌహాన్ 'ది వైర్'తో మాట్లాడారు. ఎన్నికల క్రమంలో హామీల వర్షం కురిపిస్తున్న ప్రభుత్వం తమ వాగ్దానాలను ముందే ఎందుకని అమలు చేయలేదన్నదే ఇక్కడ ప్రధాన ప్రశ్న అని అన్నారు. మా ఉద్యమం కారణంగానే తాజా ఎన్నికల్లో యాపిల్ సాగుదారుల సమస్యలపై దృష్టిపెట్టారు. ఇచ్చిన హామీలు ఎవరు అమలు చేస్తారన్నదే ప్రధాన ప్రశ్న అని అన్నారు.

గరిష్ఠ స్థాయిలో బొగ్గు డిమాండ్

న్యూఢిల్లీ: దేశంలో బొగ్గుకు డిమాండ్ ఇంకా గరిష్ఠ స్థాయిలోనే ఉందని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. 2040 దాటేవరకు ఈ పొడి ఇంధనం కీలక పాత్ర వహిస్తుందని తెలిపింది. సమీప భవిష్యత్తులో బొగ్గు నుంచి మారటం జరగదని కేంద్ర బొగ్గు మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. బొగ్గు మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన జోషి మాట్లాడుతూ... ప్రపంచంలో బొగ్గుకు దూరంగా ఇంధన పరివర్తన వైపుకు ఎంతో ప్రోత్సాహం ఉందని అన్నారు. అయితే భారత్‌కు మాత్రం బొగ్గు... సరసమైన ఇంధన వనరుగా ఉందని, పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థకు ఇంధన అవసరాలను తీర్చడానికి ప్రధాన ప్రాముఖ్యతను కలిగి ఉందని జోషి చెప్పారు. దేశ ప్రాథమిక ఇంధన అవసరాలలో బొగ్గు 51 శాతానికి పైగా ఉందని, విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు 73 శాతం ఉందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తిని తగ్గించడంలో తక్షణ సవాళ్లు లేనప్పటికీ, బొగ్గు తవ్వకంలో పాల్గొన్న కంపెనీలు... ఇప్పటికే పాడుబడిన గనుల మూసివేతను నిర్వహించాల్సి ఉంటుందని బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ సమావేశంలో తెలిపింది. దేశంలోని బొగ్గు తవ్వకంలో ప్రభుత్వ యాజమాన్య కోల్ ఇండియా లిమిటెడ్ 80 శాతానికి పైగా వాటాను కలిగి ఉంది.

అభివృద్ధికి కాంగ్రెస్ వ్యతిరేకం: మోదీ

చంబీ/సుజన్‌పూర్ (హిమాచల్‌ప్రదేశ్): హిమాచల్ ప్రదేశ్‌కు తక్షణమే డబుల్ ఇంజిన్ లాంటి సుస్థిరమైన సర్కారు కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బుధవారం హిమాచల్‌ప్రదేశ్‌లో ఆయన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. కాంగ్రెస్‌లాంటి అనిశ్చితి, అవినీతి, స్కాంల ప్రభుత్వం ఇంకేమీ ఉండదని, ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి బీజేపీకే ఓటు వేయాలని కోరారు. కంగ్రా జిల్లాలో జరిగిన ర్యాలీ మోదీ పాల్గొన్నారు. సుజన్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన కాంగ్రెస్‌ను నిందించారు. గత పాలనలో రాష్ట్రం భ్రష్టుపట్టిపోయిందని, అభివృద్ధికి ఆ పార్టీ ఓ శత్రువులా మారిందని విమర్శించారు. తాను ప్రధానమంత్రి అయిన తరువాత, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, కానీ ఆ పార్టీ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. అభివృద్ధికి అడ్డుకోవడం ఏకైక లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఒక్కటే బీజేపీకి పోటీ నిలుస్తుందని మోదీ తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు.

జీ20 లోగోలో బీజేపీ రంగులు, కమలం గుర్తు

కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ: జీ20 గ్రూప్‌నకు వచ్చే ఏడాది భారత్ అధ్యక్షత వహించనున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఆవిష్కరించిన జీ20 లోగోలో బీజేపీ జెండా రంగులు, కమలం గుర్తు ఉండడంపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. జీ20 లోగోలో బీజేపీ ఎన్నికల గుర్తు కమలం భాగం కావడం దిగ్భ్రాంతికరమని, తమను తాము ప్రమోట్ చేసుకునే ఏ అవకాశాన్ని ప్రధాని, ఆయన పార్టీ కోల్పోదని కాంగ్రెస్ బుధవారం వ్యాఖ్యానించింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, జీ20 లోగో భారతదేశ జాతీయ జెండా యొక్క శక్తివంతమైన రంగులు - కుంకుమ, తెలుపు, ఆకుపచ్చ నీలం నుండి ప్రేరణ పొందిందనీ, ఇది సవాళ్ల మధ్య వృద్ధిని ప్రతిబింబిస్తూ భారతదేశపు జాతీయ పుష్పం అయిన కమలంతో భూమిని జత చేస్తుందని ఆ శాఖ తెలిపింది. '70 సంవత్సరాల క్రితం, నెహ్రూ కాంగ్రెస్ జెండాను భారతదేశ జెండాగా చేయాలనే ప్రతిపాదనను తిరస్కరించారు. ఇప్పుడు, బీజేపీ ఎన్నికల గుర్తు జీ20 అధ్యక్ష పదవికి అధికారిక చిహ్నంగా మారింది' అని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ ట్వీట్ చేశారు. 'ఈ చర్య చూసిన తరువాత నాకు నిజంగా ఆశ్చర్యంగా ఉంది. బీజేపీ సిగ్గు లేకుండా తమను తాము ప్రమోట్ చేసుకునే ఏ అవకాశం కోల్పోరని విషయం అర్థమైంది' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరీ ఆయనపై ఎదురుదాడికి దిగారు. 1950లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కమలాన్ని జాతీయ పుష్పంగా ప్రకటించింది. కానీ జైరాం రమేశ్ 1954లో జన్మించారు. కనుక ఆయనకు దీని గురించి తెలిసుండదు' అని వ్యాఖ్యానించారు. ప్రతి జాతీయ చిహ్నాన్ని కాంగ్రెస్ కించపరచడానికి, అణదొక్కడానికి ఎందుకు ప్రయత్నిస్తుందో దేవుడికే తెలియాలి అని ఆయన అన్నారు. జీ20 లోగోలో కమలం ఎందుకు భాగమైందో ప్రధాని సందేశం వింటే అర్థమవుతుందన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా కూడా కాంగ్రెస్‌ను విమర్శించారు. 'జాతీయ పుష్పం కూడా లక్ష్మీదేవి ఆసనం. అది మీకు తెలుసా? తెలియదా? అంటే మీరు జాతీయ పుష్పాన్ని వ్యతిరేకిస్తున్నారా? అలా అయితే కాంగ్రెస్ నాయకులు కమల్‌నాథ్ పేరునుంచి 'కమల్' కూడా తీసేస్తారా ఏంటి? అని ఎద్దేశా చేశారు.

త్రిపురలో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ

అగర్తల: త్రిపురలో బీజేపీకి మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికలకు కేవలం నాలుగు నెలల ముందు అధికార కూటమి లోని కీలకమైన నేత, రాష్ట్ర అటవీ, గిరిజన శాఖ మంత్రి మేవన్ కుమార్ జమతియా తన పదవికి రాజీనామా చేశారు. ఇండిగోనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న మేవన్ కుమార్ జమతియా తన రాజీనామా లేఖను స్పీకర్ రతన్ చక్రవర్తికి అందచేశారు. 2018 ఎన్నికల్లో కోవై జిల్లాలోని అశారంబరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాగా, గత ఏడాది కాలంలో రాజీనామా చేసిన మూడో ఐపీఎఫ్‌టీ ఎమ్మెల్యే జమతియా కావడం గమనార్హం. అధికార బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమిలో రాజీనామా చేసినవారిలో ఏడో ఎమ్మెల్యే.

63వ రోజుకు భారత్ జోడో యాత్ర

మహారాష్ట్రలో స్థానికులతో రాహుల్ మమేకం

నాందేడ్ : కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' 63వ రోజుకు చేరుకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం ఉదయం మహారాష్ట్రకు చెందిన నాందేడ్ జిల్లాలో బిలోలి నుంచి యాత్రను పున: ప్రారంభించారు. తనను అభినందించడానికి గుమికూడిన స్థానికులతో సంభాషించడానికి రాహుల్ కొద్దిసేపు కొన్ని చోట్ల ఆగారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి.వేణుగోపాల్, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోల్, ముంబై పార్టీ అధ్యక్షుడు భాయ్ జగ్తప్, నసీమ్ ఖాన్, విశ్వజిత్ కదమ్, ఇతర పార్టీ నాయకులు రాహుల్‌తో కలిసి నడిచారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్లు) జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రముఖుడు దిగ్విజయ్ సింగ్, పార్టీ నాయకుడు కన్హయ కుమార్ సేవాదళ్ కార్యకర్తలతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. రాహుల్ మంగళవారం నాందేడ్‌లోని గురుద్వారాను సందర్శించారు. నోట్ల రద్దు, నిరుద్యోగం, ద్వేషపూరిత రాజకీయాలపై నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా విమర్శలు చేశారు. కాంగ్రెస్ సేవాదళ్‌కు చెందిన సీనియర్ కార్యకర్త మృతి చెందడంతో పాదయాత్ర మంగళవారం కొంతసేపు నిలిచిపోయింది. మహారాష్ట్రలో ఇది మూడో రోజు యాత్ర. సోమవారం రాత్రి పొరుగున ఉన్న తెలంగాణ నుంచి నాందేడ్‌లోని దెగ్లూర్‌లో రాహుల్ నేతృత్వంలోని పాల్గొనేవారు మహారాష్ట్రలోకి ప్రవేశించారు. మహారాష్ట్రలో, పాదయాత్ర నవంబర్ 20న మధ్యప్రదేశ్‌లో ప్రవేశించే ముందు ఐదు జిల్లాల మీదుగా 382 కి.మీ.లు సాగి 15 అసెంబ్లీ, ఆరు పార్లమెంటరీ నియోజకవర్గాల మీదుగా సాగుతుంది. కాగా రాహుల్ గురువారం నాందేడ్‌లో, నవంబర్ 18న బుల్దానా జిల్లాలోని షెగావ్‌లో ర్యాలీలో ప్రసంగిస్తారు.

ఎంపీలో రాహుల్‌కు భద్రత కల్పించండి

భోపాల్ : రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' నవంబర్ 20న మధ్య ప్రదేశ్‌లోకి ప్రవేశించిన తర్వాత కాంగ్రెస్ నాయకుడు మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్ శివాలయాలలో ప్రార్థనలు చేస్తారని, అలాగే బీఆర్ అంబేద్కర్ జన్మస్థలాన్ని కూడా సందర్శిస్తారని పార్టీ బుధవారం తెలిపింది. మంగళవారం గ్వాలియర్‌లో జరిగిన కాల్పుల ఘటనను ఉటంకిస్తూ యాత్రలో ఎంపీ రాహుల్‌కు తగిన భద్రత కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఖాండ్వా జిల్లాలోని గిరిజన ప్రముఖుడు తాంత్యా భీల్ జన్మస్థలాన్ని కూడా రాహుల్ సందర్శిస్తారని పేర్కొంది. మధ్య ప్రదేశ్‌లో తదుపరి అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 2023లో జరగాల్సి ఉంది. మహారాష్ట్ర నుంచి నవంబర్ 20న మధ్యప్రదేశ్‌లో ప్రవేశించనున్న 'భారత్ జోడో యాత్ర'కు రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తగిన భద్రత కల్పించడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆరోపించారు. డిసెంబర్ 3న రాజస్థాన్‌కు వెళ్లే ముందు 'భారత్ జోడో యాత్ర' ఎంపీలో 350 కి.మీ మేర సాగుతుందని కాంగ్రెస్ తెలిపింది.

శివసేన ఎంపీ రౌత్‌కు బెయిల్

ముంబై: మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న శివసేన(ఉద్ధవ్ ఠాక్రే వర్గం) సీనియర్ నేత సంజయ్ రౌత్‌కు ప్రత్యేక కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. శివసేన రాజ్యసభ సభ్యుడు, ఫైర్‌బ్రాండ్ నేతగా పేరున్న సంజయ్ రౌత్ మూడున్నర నెలలుగా జైల్లోనే ఉన్నారు. బెయిల్ దరఖాస్తుపై రౌత్, ఈడీ తరపు న్యాయవాదుల వాదనలు విన్న ప్రత్యేక కోర్టు అక్టోబర్ 21న తీర్పు రిజర్వ్ చేసింది. ముంబైలోని రెసిడెన్షియల్ కాలనీ పునరాభివృద్ధి వ్యవహారంలో అవకతవకల ఆరోపణలకు సంబంధించి సంజయ్ రౌత్‌ను ఆగస్టు 1న ఈడీ కస్టడీలోకి తీసుకుంది. మనీలాండరింగ్ చట్టం కింద అరెస్టు కావడానికి ముందు ఆయన్ను ఈడీ రెండుసార్లు విచారించింది. రాజకీయ కక్షతోనే తనపై తప్పుడు కేసు బనాయించినట్టు రౌత్ మొదట్నుంచీ చెబుతున్నారు. శివసేన పార్టీ తమదేనంటూ ఉద్ధవ్ థాకరే, ఏక్‌నాథ్ షిండే వర్గాల మధ్య పోరు జరుగుతున్న తరుణంలో రౌత్‌ను ఈడీ అరెస్టు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. షిండే క్యాంపు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం, ఉద్ధవ్ థాకరే సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడాన్ని రౌత్ ఎండగడుతూ వచ్చారు. రౌత్ అరెస్టు అనంతరం ముఖ్యమంత్రి షిండే సైతం తనదైన శైలిలో స్పందించారు. రౌత్ అమాయకుడైతే ఈడీ విచారణకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అర్ధరాత్రి సమయంలో రౌత్‌ను అరెస్టు చేయడాన్ని ఉద్ధవ్ థాకరే ఖండిస్తూ, రౌత్‌ను చూసి తమకు గర్వంగా ఉందని అన్నారు.

ఎన్నికలప్పుడే బీజేపీకి సీఏఏ, ఎన్ఆర్‌సీ గుర్తొస్తాయి: మమత

కృష్ణనగర్(పశ్చిమ బెంగాల్): వచ్చే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సి)ని ఉపయోగించుకోవాలని చూస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో సీఏఏ అమలును ఎప్పటికీ అనుమతించబోమని టీఎంసీ అధినేత తేల్చి చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించేందుకు యత్నిస్తోందని ఆమె ఆరోపించారు. రాష్ట్ర విభజనను తాను ఎప్పటికీ అనుమతించబోనని స్పష్టం చేశారు. 'ఏదైనా ఎన్నికలు సమీపించినప్పుడల్లా, బీజేపీ సీఏఏ, ఎన్ఆర్‌సీని అమలు చేయడం గురించి మాట్లాడుతుంది. ఈ ఏడాది చివర్లో రాబోయే గుజరాత్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు కేవలం ఏడాదిన్నర సమయం ఉండటంతో, మళ్లీ సీఏఏ సమస్యను రేకెత్తించడం ప్రారంభించింది" అని ఆమె ఆరోపించారు. కృష్ణనగర్‌లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఎవరు పౌరుడో, ఎవరు కాదో బీజేపీ నిర్ణయిస్తుందా? మతువ సామాజిక వర్గం కూడా దేశంలోనే పౌరులే" అని బెనర్జీ ప్రశ్నించారు. రాజకీయంగా శక్తిమంతమైన మతువ సామాజిక వర్గం తూర్పు బెంగాల్, ప్రస్తుత బంగ్లాదేశ్‌లో ఉంది. వారిలో చాలా మంది ఉత్తర 24 పరగణాలు, నదియా జిల్లాలలో నివసిస్తున్నారు. "రాష్ట్రంలోని ఉత్తర ప్రాంతాల్లో రాజ్‌బన్షీలు గూర్ఖాలను రెచ్చగొట్టడం ద్వారా బీజేపీ పశ్చిమ బెంగాల్‌లో వేర్పాటువాదాన్ని పెంచుతోంది. పశ్చిమ బెంగాల్ విభజనను మేం ఎప్పటికీ అనుమతించం" అని ఆమె తేల్చి చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ మళ్లీ అధికారంలోకి రాదని మమత జోస్యం చెప్పారు.

కాంగ్రెస్‌పై నమ్మకం ఉంచండి

- ఓపీఎస్ పునరుద్ధరిస్తుంది... ఉచిత విద్యుత్ ఇస్తుంది
- హిమాచల్ ఓటర్లకు చత్తీస్‌గఢ్ సీఎం బాఘెల్ విజ్ఞప్తి

బానుతి (సిమ్లా) : పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ, 300 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు నెలకు రూ.1,500 వంటి ఎన్నికల వాగ్దానాలన్నింటినీ తమ కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ బుధవారం హిమాచల్ ప్రదేశ్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్‌కు మద్దతుగా జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్‌కు 'జై రామ్' (వీడ్కోలు) చెప్పాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 'కాంగ్రెస్ చెప్పినట్టే చేస్తుంది. చత్తీస్‌గఢ్‌లో చేసిన విధంగా హిమాచల్‌లో అన్ని హామీలను నెరవేరుస్తాం. చత్తీస్‌గఢ్, రాజస్థాన్, జార్ఖండ్‌లో పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) అమలవుతోంది. దీనిని అమలు చేస్తున్న నాల్గవ రాష్ట్రంగా హిమాచల్ అవతరిస్తుంది' అని తెలిపారు. జాతీయ పింఛను పథకంలో జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నిధులను విడుదల చేయనందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ... ఆ డబ్బు రాష్ట్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులదే అయినందున కేంద్రం నిధుల పై ఎలా పట్టుబడుతుందని ఆయన ప్రశ్నించారు. పింఛను నిధుల విడుదలను కేంద్రం ఎక్కువ కాలం ఆపలేదని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్నారు. గత అనేక దశాబ్దాలుగా కాంగ్రెస్, బీజేపీ ప్రత్యామ్నాయంగా పరిపాలిస్తున్న ఈ పర్వత ప్రాంత రాష్ట్రంలో బీజేపీ నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. హిమాచల్ ప్రదేశ్‌లో నవంబర్ 12న పోలింగ్, డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ, 300 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.680 కోట్ల స్టార్టప్ ఫండ్, లక్ష ఉద్యోగాలు, 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1,500 వంటి హామీలు హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రజలకు డబ్బు ఇస్తుందని, పెట్రోల్, డీజిల్‌పై పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం ద్వారా బీజేపీ వారి జేబుల్లోంచి డబ్బును లాక్కుంటుందని బాఘెల్ అన్నారు. 'కాంగ్రెస్‌పై విశ్వాసం ఉంచండి. మీకు ఉచిత విద్యుత్, ఓపీఎస్, మహిళలకు రూ.1,500... మీ ఆదాయాన్ని పెంచడంలో సహాయపడతాయి' అని సిమ్లా రూరల్ నియోజకవర్గం నుంచి విక్రమాదిత్య సింగ్‌ను ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. సింగ్, మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ కుమారుడు. 'అన్ని సమస్యలు ప్రజల ముందు ఉన్నాయి. ఎన్నికలకు కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్నాయి. బీజేపీ ఏం మాట్లాడినా అందరూ తమ నిర్ణయం తీసుకున్నారు' అని అన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరయ్యారు. బాఘెల్ మాట్లాడుతూ 'ప్రజాస్వామ్యం కాంగ్రెస్‌లో ఉంది. బీజేపీలో కాదు. ప్రజలకు కూడా తెలుసు' అని అన్నారు. బీజేపీకి 21 మంది రెబల్స్ పోటీలో ఉన్నారనిని, బీజేపీ రెబెల్స్‌ను పక్కకు తప్పుకోవాలని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని ఆయన ఉదహరించారు.

దేశ గతిని మార్చిన ఆర్థిక సంస్కరణలు

మన్మోహన్‌కు దేశం రుణపడి ఉంది: నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: గతంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ 1991లో చేపట్టిన ఆర్థిక సంస్కరణలు దేశ గతిని మార్చాయని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆ సమయంలో తాను మహారాష్ట్రలో మంత్రిగా ఉన్నానని, సంస్కరణల వల్లే రోడ్ల నిర్మాణానికి భారీ ఎత్తున నిధుల్ని సమీకరించగలిగానని గుర్తుచేసుకున్నారు. దేశం ఎప్పటికీ మన్మోహన్ సింగ్‌కు రుణపడి ఉంటుందని చెప్పారు. రైతులు, పేద వర్గాలకు లబ్ధి చేకూర్చే ఉదారవాద ఆర్థిక విధానాల్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్థిక సంస్కరణలు దేశ అభివృద్ధికి ఎలా దోహదం చేస్తాయో చెప్పడానికి చైనాయే ప్రత్యక్ష ఉదాహరణ అని గడ్కరీ తెలిపారు. అలాగే భారత్ ఆర్థికంగా వేగవంతమైన వృద్ధి సాధించాలంటే మరింత మూలధన పెట్టుబడి కావాలని అన్నారు. రోడ్లు, రహదారుల నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ సామాన్య ప్రజల నుంచి కూడా నిధుల సమీకరిస్తోందని గడ్కరీ తెలిపారు. ప్రస్తుతం 26 కొత్త ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మిస్తోందని, నిధులకు ఎలాంటి కొరత లేదని పేర్కొన్నారు. రోజుకు 60 కిలోమీటర్ల రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఎన్‌హెచ్ఏఐకి ఏటా రూ.40 వేల కోట్ల టోల్ రెవెన్యూ వస్తోందని, అది 2024 ఆఖరుకల్లా రూ.1.40 లక్షల కోట్లకు చేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఐక్యతకు కట్టుబడి ఉంది

పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ : తమ పార్టీ ఐక్యతకు కట్టుబడి ఉందని, బీజేపీది ఏకరూపతను విశ్వసిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ బుధవారం అన్నారు. భారత్ జోడో యాత్ర 'మన్ కీ బాత్' కాదని, అయితే ప్రజల ఆందోళనలను వెలికితీయడమే లక్ష్యంగా తమ పార్టీ యాత్ర ఉందని నొక్కి చెప్పారు. కాంగ్రెస్ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర సందర్భంగా మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో జైరాం రమేశ్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్), బీజేపీకి 'భిన్నత్వంలో ఏకత్వం' పై నమ్మకం లేదని, దీనికి భారతదేశం ఒక ఉదాహరణ అని అన్నారు. అధికార బీజేపీని ఎదుర్కోగల ఏకైక పార్టీగా కాంగ్రెస్ విమర్శకులు కూడా యాత్రలో పాల్గొంటున్నారు. సెప్టెంబర్ 7న తమిళనాడులో కన్యాకుమారి నుంచి ప్రారంభమైన పాదయాత్ర 'చునావ్ జీతో యాత్ర' (ఎన్నికల గెలుపు కోసం) కాదని తెలిపారు. 'కాంగ్రెస్ ఎన్నికల అదృష్టం పై యాత్ర ఎలాంటి ప్రభావం చూపుతుందో కాలమే చెబుతుంది. అయితే ఇది పార్టీని పునరుజ్జీవింపజేసి స్వచ్ఛమైన గాలిని నింపింది' అని ఆయన అన్నారు. భారత్ జోడో యాత్ర అనేది ప్రజలకు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీకి మధ్య 'ప్రత్యక్ష సంభాషణ' అని తెలిపారు. ఎందుకంటే బీజేపీ చూపుతున్నట్లుగా కాకుండా, ప్రజలు నిజమైన రాహుల్ గాంధీని చూడగలుగుతారని తెలిపారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ సభ్యుడు రాహుల్‌గాంధీకి పార్లమెంటులో మాట్లాడేందుకు అనుమతి లేదని అన్నారు. 'ఆయన (గాంధీ) మాట్లాడటానికి నిలబడితే కిందకి దించబడ్డాడు. స్పీకర్ ఆయనకు సమయం ఇవ్వడం లేదు. ఆయన రక్షణ పై స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కానీ చైనా పై ప్రశ్నలు అడగడానికి అనుమతి లేదు' అని జైరాం రమేశ్ అన్నారు. 'ప్రధాని నరేంద్ర మోదీ ఉద్దేశాలు, విధానాల వల్ల దేశం విచ్ఛిన్నమవుతోంది. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. ఫలితంగా ధరల పెరుగుదల, నిరుద్యోగం. రాజకీయ, ఎన్నికల ప్రయోజనాల కోసం బీజేపీ సామాజిక ధ్రువణాన్ని కలిగి ఉంది' అని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. 'రాజకీయ నియంతృత్వం' పెరుగుతోందని, అన్ని అధికారాలు పీఎంవో (ప్రధాన మంత్రి కార్యాలయం) లో కేంద్రీకృతమై ఉన్నాయని విమర్శించారు. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ), పెద్దనోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థ నాశనం అయిందన్నారు. కాగా భారత్ జోడో యాత్ర గురువారం సాయంత్రానికి మొత్తం 3,570 కి.మీ దూరంలో సగభాగాన్ని చేరుకుంటుందని జైరాం రమేశ్ తెలిపారు. యాత్రకు మహారాష్ట్ర కొత్త శక్తిని ఇచ్చిందని, ప్రతిరోజూ 22 కిలోమీటర్లు ప్రయాణించే బదులు బుధవారం 24 కి.మీ నడిచినట్లు వివరించారు. భారత్ జోడో యాత్రలో నాందేడ్ 27వ జిల్లా అని కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. నవంబర్ 17 మధ్యాహ్నం 1 గంటలకు షెగావ్ (బుల్దానా జిల్లా) లో రాహుల్ గాంధీ విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తారని ఆయన చెప్పారు. శివసేన, కాంగ్రెస్‌ల భిన్న సిద్ధాంతాలపై అడిగిన ప్రశ్నకు రమేశ్ బదులిస్తూ... 'బీజేపీని ఓడించగల ఏకైక పార్టీ కాంగ్రెస్ అని విమర్శకులు గ్రహించారు. బీజేపీ పెద్ద ప్రమాదమని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని శివసేనకు కూడా తెలుసు. రెండు పార్టీల సిద్ధాంతాల మధ్య మధ్యేమార్గాన్ని కనుగొనేందుకే తాము ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని రూపొందించుకున్నాం' అని చెప్పారు. ఈ యాత్ర స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని నవంబర్ 15న గిరిజన సదస్సుతో జరుపుకోనుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అశోక్ చవాన్ మాట్లాడుతూ ఎన్‌సీపీకి చెందిన జయంత్ పాటిల్, సుప్రియా సూలే, జితేంద్ర అవద్ గురువారం యాత్రలో పాల్గొంటారని, శివసేనకు చెందిన ఆదిత్య థాకరే నవంబర్ 11న యాత్రలో పాల్గొంటారని తెలిపారు.

సీజేఐగా జస్టిస్ లలిత్ హయాంలో

ఏడు కీలక కేసుల విచారణ

74 రోజుల పదవీకాలంలో అనేక పెండింగ్ వ్యవహారాల పరిశీలన

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ యూయూ లలిత్ సోమవారం పదవీ కాలం పూర్తి అయింది. ఆయన ఆగస్టు 27న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. కేవలం 74 రోజులు పదవిలో కొనసాగారు. ఇంత తక్కువ సమయంలో అనేక పెండింగ్ వ్యవహారాలను పరిశీలించారు. కీలక తీర్పులు వెలువరించారు. ఈడబ్ల్యూఎస్ కోటా, సీఏఏ, పెద్దనోట్ల రద్దు, జీఎన్ సాయిబాబా వ్యవహారంలో బాంబే హైకోర్టు తీర్పు రద్దు, కోర్టు విచారణల ప్రత్యక్ష ప్రసారం, హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌కు, జర్నలిస్టు సిద్దీఖీ కప్పన్‌కు బెయిల్ లభించడం వంటివన్నీ సీజేఐగా జస్టిస్ లలిత్ హయాంలో జరిగాయి. ఆయన హయాంలో సుప్రీంకోర్టు విచారించిన కేసుల్లో కొన్ని...

ఈడబ్ల్యూఎస్ కోటా: సీజేఐగా చివరి రోజున జస్టిస్ లలిత్‌తో కూడిన ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం ఈడబ్ల్యూఎస్ కోటా వ్యవహారాన్ని విచారించింది. అగ్ర వర్ణాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడి వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో పది శాతం రిజర్వేషన్ల రాజ్యాంగబద్ధతపై తీర్పును వెలువరించింది. ఐదుగురిలో ముగ్గురు న్యాయమూర్తులు సమర్థించగా ఇద్దరు వ్యతిరేకించడంతో 3:2 నిష్పత్తితో ఉత్తర్వులు జారీ అయ్యాయి. జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ భిన్నాభిప్రాయాన్ని జస్టిస్ లలిత్ సమర్థించారు. మినహాయింపులివ్వడం అంటే రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని అతిక్రమించడమేనని వ్యతిరేకించిన న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు.

కోర్టు విచారణ ప్రత్యక్ష ప్రసారం: సుప్రీంకోర్టు విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేస్తామని సెప్టెంబరు 20న జస్టిస్ లలిత్ ప్రకటించారు. అయితే 2018లో అప్పటి సీజేఐ దీపక్ మిశ్రా ధర్మాసనం ఈ మేరకు నిర్ణయించగా సీజేఐగా జస్టిస్ లలిత్ ఆధ్వర్యంలో ఆచరణలోకి రాగలిగింది.

తీస్తా సెతల్వాడ్‌కు బెయిల్: హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ లలిత్ నేతృత్వ ధర్మాసనం సెప్టెంబరు 2న ఉత్తర్వులు జారీచేసింది. 2002 గుజరాత్ అల్లర్ల కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టించారని, అమాయకులను జైలుకు పంపే కుట్ర చేశారన్న ఆరోపణలతో సెతల్వాడ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. అప్పిలేట్‌ను పోలీసు కస్టడీలో ఏడు రోజులు ఉంచి సంబంధిత అధికారులు ప్రతిరోజు విచారించడం రికార్డు చేయాల్సిన విషయమని సెతల్వాడ్‌కు బెయిల్ మంజూరు చేసేటప్పుడు జస్టిస్ లలిత్ అన్నారు.

సిద్దీఖీ కప్పన్‌కు బెయిల్: 2020 అక్టోబరులో హత్రాస్‌లో దళిత యువతి హత్యాచారం వార్తాసేకరణకు వెళుతుండగా అరెస్టుకు గురై యూఏపీఏ కేసులో ఇరుకున్న జర్నలిస్టు సిద్దీఖీ కప్పన్‌కు జస్టిస్ లలిత్ ధర్మాసనం సెప్టెంబరు 9న బెయిల్ మంజూరు చేసింది. 'ప్రతి పౌరునికి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. బాధితురాలికి న్యాయం జరగాల్సిన అవసరాన్ని చూపేందుకు, సామాన్యుల గొంతుకను పెద్దగా వినిపించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. చట్టం దృష్టిలో ఇది నేరమా?' అని సిద్దీఖీకి బెయిల్ మంజూరు చేసే సమయంలో జస్టిస్ లలిత్ ప్రశ్నించారు. సిద్దీఖీని కుట్రలో భాగస్వాముడిగా పేర్కొన్న ఉత్తరప్రదేశ్ పోలీసులను జస్టిస్ లలిత్ అనేక ప్రశ్నలు వేశారు. అయితే మనీలాండరింగ్ కేసులో బెయిల్ రాని కారణంగా సిద్దీఖీ కప్పన్ ఇంకా జైల్లోనే ఉన్నారు.

సీఏఏపై పిటిషన్లు: పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) సవాల్ చేస్తూ 232 పిటిషన్లు 2019 నుంచి సుప్రీంకోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. జస్టిస్ లలిత్ నేతృత్వ ధర్మాసనం ఈ కేసు విచారణ తేదీని 2022, డిసెంబరు 6గా ఖరారు చేసింది. ఈలోగా పేపర్‌వర్క్ (రాత పని) పూర్తి చేయాలని పిటిషన్లకు, కేంద్రంతో పాటు అసోం ప్రభుత్వానికి సూచించింది. అందుకోసం ఐదు వారాల గడువు ఇచ్చింది. జస్టిస్ లలిత్ ధర్మాసనం విచారణకు ముందుకు కేంద్ర హోం వ్యవహారాల శాఖ ఒక అఫిడవిట్‌ను సుప్రీంకోర్టులో సమర్పించింది. అందులో సీఏఏను నిరపాయమైన చట్టంగా పేర్కొంది.

పెద్దనోట్ల రద్దు: సుప్రీంకోర్టులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో పెద్దనోట్ల రద్దు ఒకటి. జస్టిస్ లలిత్ ధర్మాసనం ఈ కేసునూ విచారించింది. 2016 నవంబరు 8న రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తూ రాత్రికి రాత్రి మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. నోట్ల రద్దు లక్ష్యాలు నెరవేరాయా అని ఆర్బీఐ, కేంద్రప్రభుత్వాన్ని అక్టోబరు 12న ప్రశ్నించింది. ఈ చర్యను సవాల్ చేస్తూ దాఖలైన 58 పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది.

జీఎన్ సాయిబాబా కేసు: జస్టిస్ లలిత్ హయాంలో వెలువరించిన ఒక తీర్పుపై హక్కుల కార్యకర్తలు, కోర్టుల పరిశీలకుల నుంచి అభ్యంతరం వ్యక్తం అయింది. అదే జీఎన్ సాయిబాబు కేసు. మావోయిస్టు లింకుల కేసులో సాయిబాబాతో పాటు ఇతరుల విడుదలకు బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం నిలువరించింది. సాయిబాబా, ఇతర నిందితులను విడుదల చేయలేదని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ బేలా ఎం త్రివేది ఉత్తర్వులు పేర్కొన్నాయి. కాగా కోర్టు పనిచేయని రోజున ప్రత్యేక బెంచీ విచారణ కోసం ఈ కేసును అత్యవసరంగా లిస్టింగ్‌లో పెట్టడం విదితమే.

ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్న కర్ణాటక

బెంగళూరు: ఈ నెల 11వ తేదీన ఇక్కడ జరిగే ప్రధానమంత్రి కార్యక్రమానికి విద్యార్థులను పంపాలని బెంగళూరు రూరల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రీ-యూనివర్శిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశిస్తూ జారీచేసిన ఉత్తర్వులను కర్ణాటక ప్రభుత్వం బుధవారం ఉప సంహ రించుకుంది. బెంగళూరు రూరల్‌లోని అన్ని పీయూ కళాశాలల ప్రిన్సి పాళ్లతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు విద్యాసంస్థలు... తమ విద్యార్థులను ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమానికి తీసుకురావాలని విద్యాశాఖ మంగళవారం జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొం ది. ఈ కార్యక్రమానికి విద్యార్థులను సమీక రించాలని ప్రధానోపాధ్యాయులను కోరామని, ఆదేశాన్ని పాటించడంలో ఏదైనా లోపం ఏర్పడితే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొంది. తాజాగా ఈ ఆదేశాలను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. కాగా కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 2, నాడప్రభు కెంపేగౌడ108 అడుగుల కాంస్య విగ్రహాన్ని ప్రారంభిం చేందుకు ప్రధానమంత్రి శుక్రవారం బెంగళూరుకు రానున్నారు.

బ్రిటన్ మంత్రి విలియమ్‌సన్ రాజీనామా

లండన్: తోటివారితో అనుచితంగా వ్యవహారం, పనివారిని వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు రావడంతో బ్రిటన్ మంత్రిగా గావిన్ విలియమ్‌సన్ రాజీనామా చేశారు. తనపై వచ్చిన ఆరోపణల వల్ల ఈ ప్రభుత్వం చేసే మంచి నుంచి దృష్టి మళ్లుతోందని, ఇది నచ్చకనే రాజీనామా చేస్తున్నానని తెలిపారు. ఈ మేరకు రాజీనామా లేఖను ప్రధాని రిషి సునక్‌కు పంపారు. 'అనుచిత సందేశాలు పంపినట్లు వచ్చిన ఆరోపణలకు చింతిస్తున్నాను. సంబంధిత వ్యక్తికి క్షమాపణలు చెప్పాను. ఈ ప్రభుత్వం కళంకితం కావడం ఇష్టం లేక రాజీనామా చేస్తున్నా. అలాగనీ నాపై ఆరోపణలను అంగీకరించడం లేదు. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదనే పదవీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను' అని విలియమ్‌సన్ పేర్కొన్నారు.

'మెటా'...11వేల మందికి 'టాటా'

చీఫ్ ఎగ్జిక్యూటివ్ మార్క్ జుకర్ బర్గ్

వాషింగ్టన్: అనుకున్నంతా అయ్యింది. ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా అనుకున్నట్లుగానే ఉద్యోగాల కోత మొదలుపెట్టింది. కంపెనీలో పనిచేస్తున్న 11 వేల మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు ప్రకటించింది. ఉద్యోగుల సంఖ్యను 13 శాతం మేర తగ్గించుకుంటున్నట్లు మెటా చీఫ్ ఎగ్జిక్యూటివ్ మార్క్ జుకర్ బర్గ్ బుధవారం ప్రకటించారు. ఉద్యోగుల తొలగింపు విషయాన్ని మెటా చరిత్రలో కఠినమైన రోజుగా జుకర్‌బర్గ్ అభివర్ణించారు. కంపెనీలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల్లో 13 శాతం అంటే 11 వేల మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు చెప్పారు. అలాగే, కంపెనీ ఖర్చులను తగ్గించుకోవడంపై దృష్టి పెడతామన్నారు. వచ్చే ఏడాది తొలి త్రైమాసికం వరకు నియామక ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రకటనల ఆదాయం తగ్గడం వల్ల ప్రధాన ఆదాయంపై ప్రభావం పడిందని, దీంతో కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. దీనంతటికీ తనదే బాధ్యత అని పేర్కొన్న మార్క్ తొలగింపునకు గురైన ఉద్యోగులకు ఈ సందర్భంగా క్షమాపణ చెప్పారు. 2004లో ఫేస్‌బుక్ ప్రారంభమైన తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగాలను తొలగించడం ఇదే తొలిసారి. డిజిటల్ ప్రకటనల ఆదాయం తగ్గుముఖం పట్టడం, మాంద్యం భయాలు వెంటాడుతున్న వేళ మెటా నుంచి ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం. ప్రస్తుతం మెటాలో సుమారు 87 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇటీవల ట్విటర్‌ను హస్తగతం చేసుకున్న ఎలాన్ మస్క్ సైతం సగం మంది ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే. మరోవైపు సిలికాన్‌వ్యాలీకి చెందిన ఇతర కంపెనీలు సైతం నియామకాలను తగ్గించుకోవాలని ఇప్పటికే నిర్ణయించాయి.

16 వారాల వేతనం: కంపెనీ నుంచి ఉద్వాసనకు గురైన ఉద్యోగులకు ఆ మేరకు ఈ-మెయిల్ వస్తుందని జుకర్‌బర్గ్ తెలిపారు. వారి కంప్యూటర్లకు యాక్సెస్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే తొలగింపునకు గురైన ఉద్యోగులకు 16 వారాల వేతనం లభిస్తుందని చెప్పారు. కంపెనీలో పనిచేసిన కాలానికి ఏడాదికి రెండు వారాల చొప్పున అదనపు వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

పెద్దనోట్ల రద్దుపై విచారణ వాయిదా

న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2016లో పెద్ద నోట్ల (రూ.500, రూ.1000 కరెన్సీ నోట్ల)ను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు నవంబర్ 24కి వాయిదా వేసింది. ఈ అంశంపై సమగ్ర అఫిడవిట్ దాఖలు చేసేందుకు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి సమయం కావాలని కోరడంతో జస్టిస్ ఎస్ఏ నజీర్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. అఫిడవిట్‌ను సిద్ధం చేయలేకపోయినందుకు న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, ఏఎస్ బోపన్న, వి రామసుబ్రమణియన్, బీవీ నాగరత్నతో కూడిన ధర్మాసనానికి వెంకటరమణ క్షమాపణలు చెబుతూ వారం రోజుల గడువు కోరారు. కాగా పిటిషనర్ వివేక్ నారాయణ్ శర్మ తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ మాట్లాడుతూ... రాజ్యాంగ ధర్మాసనాన్ని విఆరణ వాయిదా వేయమని కోరడం అసాధారణమని అన్నారు. ఒక పార్టీ తరఫున సీనియర్ న్యాయవాది పి.చిదంబరం మాట్లాడుతూ... ఇది ఇబ్బందికర పరిస్థితి అని అన్నారు. అఫిడవిట్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టు కేంద్రానికి వారం రోజుల గడువు ఇచ్చింది. నవంబర్ 8, 2016న కేంద్రం తీసుకున్న కరెన్సీ నోట్ల రద్దు నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన 58 పిటిషన్లను ధర్మాసనం విచారించింది. డిసెంబరు 16, 2016న, అప్పటి ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం... పెద్ద నోట్ల రద్దు నిర్ణయం చెల్లుబాటు, ఇతర సంబంధిత విషయాల పరిశీలన కోసం ఐదుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనానికి నివేదించింది.

జగన్ తీరుతో పులివెందులకూ చెడ్డపేరు

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల ముఖాముఖి భేటీలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి జగన్ తన పాలనా తీరు, విద్వేష రాజకీయాల కారణంగా తనను ఎన్నుకున్న పులివెందులకూ చెడ్డపేరు తెస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళ, బుధవారాల్లో పులివెందుల, వెంకటగిరి, నూజివీడు, తుని, పాడేరు, పాలకొండ నియోజకవర్గాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడతూ, వివేకా హత్యపై సమాధానం చెప్పలేక నైతికంగా పతనం అయ్యారన్నారు. బాబాయ్ హత్య కేసులో స్వయంగా ముఖ్యమంత్రి దోషులను కాపాడడం స్థానిక ప్రజలకు మింగుడు పడడంలేదన్నారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌కు అదే చివరి చాన్స్ అవ్వనుందని... ప్రజల్లో ఎక్కడ చూసినా ఈ చర్చే కనిపిస్తోందని నేతలతో చెప్పారు. అన్ని వర్గాల్లో వైసీపీ ప్రభుత్వం పూర్తి వ్యతిరేకత తెచ్చుకున్న పరిస్థితిని రాజకీయంగా తమకు అనుకూలంగా మార్చుకోవాలని నేతలకు సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటం, పార్టీ కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రజలకు మరింత చేరువ అవ్వాలని అన్నారు. గ్రామస్థాయి వరకు గ్రూపులు అనే అంశమే ఉండకూడదని... ఇన్‌చార్జ్‌లు అందరినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. రివ్యూల అనంతరం పనితీరులో మార్పు వచ్చిందా లేదా అనే అంశంపైనా సమాచారం తెప్పించుకుంటున్నామని చంద్రబాబు అన్నారు. సమీక్షల అనంతరం కూడా కొందరు నేతలు యాక్టివ్ అవ్వడం లేదని తన దృష్టికి వచ్చిందని, అటువంటి నేతల విషయంలో త్వరలో నిర్ణయాలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటి వరకు 126 నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లతో సమీక్షలు పూర్తి చేశారు.

ఆచంటలో దళితులు టీడీపీలో చేరిక

ఆచంటలో దళిత నేత చిర్రా బాలాజీ ఆధ్వర్యంలో దళితులు పెద్దసంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన చంద్రబాబు వైసీపీ ప్రభుత్వం దళితులకు సంబంధించి 25 కార్యక్రమాలను రద్దు చేసిందని వివరించారు.

'బింబిసార' దర్శకుడితో రామ్‌చరణ్ సినిమా?

హైదరాబాద్: కల్యాణ్ రామ్ హీరోగా నటించిన సోషియో, ఫాంటసీ చిత్రం 'బింబిసార' ఎంత పెద్ద హిట్ అయ్యిందో తెలిసిందే. ఈ సినిమాతో వశిష్ట దర్శకుడిగా పరిచయమైయ్యాడు. మొదటి సినిమా అయినప్పటికీ కథని బాగా చూపించాడనే పేరును కూడా సంపా దించాడు. ఈ యువ దర్శకుడితోనూ చరణ్ కథా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ సినిమాని యూవీ క్రియేషన్స్ నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. వశిష్ట మొదటి చిత్రం కంటే ఈ మూవీ ఇంకా గ్రాండ్‌గా ఉంటుందని అంటున్నారు. ఇదే నిజమైతే.. రెండో సినిమాతోనే ఈ యువ దర్శకుడు పాన్ ఇండియా స్థాయి అవకాశం కొట్టేసినట్లేనని అందరూ అనుకుంటున్నారు. కాగా.. చరణ్ ప్రస్తుతం శంకర్‌తో 'ఆర్‌సీ15' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న సినిమాలో నటిస్తున్నాడు. ఈ చిత్రం 2024లో ప్రేక్షకుల ముందుకి వచ్చే అవకాశం ఉంది. అలాగే.. 'ఆర్ఆర్ఆర్' తర్వాత చరణ్ చేసే ప్రతి సినిమా పాన్ ఇండియా అయ్యే అవకాశమే ఎక్కువగా ఉంది.

విశాలాంధ్ర రీల్

కేరాఫ్ కంచరపాలెం దర్శకుడితో బాలకృష్ణ చిత్రం

హైదరాబాద్: టాలీవుడ్‌లో మాస్, యాక్షన్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు నందమూరి బాలకృష్ణ, వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. చివరగా 'అఖండ'లో నటించారు. బ్లాక్ బాస్టర్ హిట్ కొట్టారు. ఈ మూవీ ఇచ్చిన జోష్‌తో గోపిచంద్ మలినేనికి ఒకే చెప్పారు. 'వీరసింహా రెడ్డి'లో నటిస్తున్నారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా థియేటర్స్‌లోకి రానుంది. 'వీరసింహా రెడ్డి' తర్వాత అనిల్ రావిపూడితో ఓ చిత్రం చేయనున్నారు. వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న బాలకృష్ణకు సంబంధించిన ఓ వార్త ఫిల్మ్‌నగర్‌లో హల్‌చల్ చేస్తుంది. ఓ యంగ్ డైరెక్టర్ తాజాగా బాలకృష్ణకు కథను వినిపించాడని ఫిల్మ్ నగర్ వర్గాలు తెలుపుతున్నాయి. 'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాలతో గుర్తింపు సంపాదించుకున్న యంగ్ డైరెక్టర్ వెంకటేశ్ మహ. ప్రయోగాత్మక కథలు, విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. వెంకటేశ్ మహ తాజాగా బాలయ్యకు ఓ స్క్రిప్ట్‌ను వినిపించారని సమాచారం. ఆ కథ బాలకృష్ణకు నచ్చిందని తెలిసింది. వెంకటేశ్ తన శైలిలోనే కొత్త రకమైన కథతో ఈ సినిమాను తెరకెక్కించనున్నారని ఫిల్మ్ నగర్ వర్గాలు తెలుపుతున్నాయి.

వాల్తేరు వీరయ్యలో ఊర్వశీ రౌతేలా

హైదరాబాద్: మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించి హీరోయిన్‌గా మారిన అందాల భామ ఊర్వశి రౌతేలా. బాలీవుడ్‌లో అనేక చిత్రాలు చేసి గుర్తింపు సంపాదించుకుంది. తన నటనతో ప్రేక్షకులను ఆకట్టు కుంది. తాజాగా అరుదైన అవకాశాన్ని చేజిక్కిం చుకుంది. ఈ అందాల భామ టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వనుంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న సినిమా 'వాల్తేరు వీరయ్య'. రవితేజ, శ్రుతి హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాబీ దర్శకత్వం వహిస్తున్నాడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తు న్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో రూపొందిస్తుంది. ఊర్వశీ రౌతేలా ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. కథను మలుపు తిప్పే పాత్రలో ఆమె కనిపించనుందని సమాచారం. ఊర్వశీ నేవీ ఆఫీసర్ రోల్‌ను పోషిస్తుందని తెలుస్తోంది. ఈ అందాల భామ ఇప్పటికే మూవీ షూటింగ్‌ను మొదలుపెట్టింది. 'వాల్తేరు వీరయ్య' లో ఓ ప్రత్యేక గీతంలోను ఊర్వశీ నర్తించనుంది. చిరంజీవితో కలసి స్టెప్పులేయనుంది. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా థియేటర్స్‌లో విడుదల కానుంది.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు

విశాలాంధ్ర-గుంటూరు: ఆంధ్రప్రదేశ్ రెవె న్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్వర్యంలో 11 నుంచి 13 వరకు ఆచార్య నాగార్జున యూని వర్సిటీలో రెవెన్యూ శాఖలోని గ్రామ రెవెన్యూ సహాయకుని స్థాయి నుంచి డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు 6వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు-2022లను నిర్వహించ నున్నట్లు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు తెలిపారు. యూనివర్సిటీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన, సిటీ సెంటర్ నుంచి 1200 మంది క్రీడాకారులు 10వ తేదీ ఉదయం 10 గంటలకే యూనివర్సిటీకి చేరుకుంటారని, 11 నుంచి క్రీడా, సాంస్కృతిక సంబరాల్లో పాల్గొంటారని వెల్లడించారు. 11న ఉదయం 9 గంటలకు జరిగే ప్రారంభోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, రాష్ట్ర క్రీడలు, యూత్ సర్వీసెస్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ జి.వాణీమోహన్, రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఎం.వేణుగోపాల్ రెడ్డి, విజయ కృష్ణన్, ఎల్.శివశంకర్ పాల్గొంటారని వివరించారు. 13న సాయంత్రం జరిగే ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారులు కిదాంబి శ్రీకాంత్, విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, పర్యాటక, క్రీడలు శాఖా మంత్రి ఆర్కే రోజా, పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేశ్, నీటి పారుదల శాఖా మంత్రి అంబటి రాంబాబు, సాంఘిక శాఖా మంత్రి మేరుగ నాగార్జున, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యా శాఖామంత్రి విడదల రజనీ హాజరవుతారని వివరించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని రెవెన్యూ ఉద్యోగులను కోరారు. ఏపీ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. విశ్వేశ్వరనాయుడు, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి, కోశాధికారి వీవీ గిరికుమార్, ఉపాధ్యక్షుడు ఆర్‌వీ రాజేశ్, కార్యదర్శి ఎం.మాధురి, ఎ.పెంచలరెడ్డి, ఏపీ వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోనా ఆంజనేయ కుమార్(చంటి), సాంబశివరావు, ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేరిపోగు ప్రసన్న, ఏపీ గ్రేడ్-2 వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్ చౌదరి, అనుపమ, ఏపీ వీఆర్ఏ అసోసియేషన్ కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యూజిలాండ్ చిత్తు... ఫైనల్లో పాకిస్తాన్

సిడ్నీ: టీ20 ప్రపంచకప్ 2022 ఫైనల్‌కు పాకిస్తాన్ దూసుకెళ్లింది. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన సెమీఫైనల్-1లో సమష్టిగా రాణించిన పాకిస్తాన్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. అనూహ్య పరిస్థితుల్లో సెమీఫైనల్ చేరిన ఆ జట్టు అసాధారణ ఆటతీరుతో టైటిల్ ఫైట్‌కు సిద్ధమైంది. మరోవైపు టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబర్చిన న్యూజిలాండ్ కీలక ఫైనల్లో చెత్త ఫీల్డింగ్‌తో మూల్యం చెల్లించుకుంది. మరోసారి టైటిల్ లేకుండానే వెనుదిరిగింది. గురువారం భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగే మ్యాచ్‌లో గెలిచే జట్టుతో పాక్ ఆదివారం ఫైనల్ ఆడనుంది.

చెలరేగిన బాబర్, రిజ్వాన్

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 152 పరుగులు చేసింది. డారిల్ మిచెల్(35 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 53 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. కేన్ విలియమ్సన్(42 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 46) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. పాక్ బౌలర్లలో షాహిన్ షా అఫ్రిది రెండు వికెట్లు తీయగా.. మహమ్మద్ నవాజ్ ఓ వికెట్ పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్తాన్ 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 153 పరుగులు చేసింది. మహమ్మద్ రిజ్వాన్(43 బంతుల్లో 5 ఫోర్లతో 57), బాబర్ ఆజామ్(42 బంతుల్లో 7 ఫోర్లతో 53) హాఫ్ సెంచరీలతో రాణించారు. తొలి వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. కివీస్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ రెండు వికెట్లు తీయగా.. మిచెల్ సాంట్నర్ ఓ వికెట్ పడగొట్టాడు.

అదిరిపోయే ఆరంభం..

153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్‌కు ఓపెనర్లు బాబర్ ఆజామ్, మహమ్మద్ రిజ్వాన్ అదిరిపోయే శుభారంభం అందించారు. టోర్నీ ఆసాంతం విఫలమైన ఈ జోడీ.. అసలు సిసలు మ్యాచ్‌లో సత్తా చాటింది. తొలి ఓవర్ నుంచే న్యూజిలాండ్ బౌలర్లపైకి ఎదురు దాడికి దిగింది. బౌల్ట్ వేసిన తొలి ఓవర్‌లో బాబర్ ఆజామ్ ఇచ్చిన కష్టమైన క్యాచ్‌ను కీపర్ డెవాన్ కాన్వే నేలపాలు చేశాడు. ఆ వెంటనే రనౌటయ్యే ప్రమాదాన్ని కూడా బాబర్ తప్పించుకున్నాడు. ఈ అవకాశాలతో రెచ్చిపోయిన అతను బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ ఇద్దరూ పోటాపడి బౌండరీలు బాదడంతో పవర్ ప్లేలో వికెట్ నష్టపోకుండా పాక్ 55 పరుగులు చేసింది.

105 పరుగుల భాగస్వామ్యం..

ఆ తర్వాత స్పిన్నర్లు బరిలోకి దిగినా.. పాక్ ఓపెనర్లు స్మార్ట్‌గా క్విక్ సింగిల్స్, డబుల్స్‌తో జట్టు స్కోర్‌ను ముందుకు తీసుకెళ్లారు. నిలకడగా ఆడిన ఈ జోడీ కివీస్ బౌలర్ల తప్పిదాలను క్యాష్ చేసుకొని చెలరేగింది. దాంతో పాక్ 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 87 పరుగులు చేసింది. ఫెర్గూసన్ వేసిన మరుసటి ఓవర్‌లో క్విక్ సింగిల్ తీసిన బాబర్ 38 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం ధాటిగా ఆడే క్రమంలో బౌల్ట్ బౌలింగ్ క్యాచ్ ఔటయ్యాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 105 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

చెత్త ఫీల్డింగ్..

బాబర్ ఔట్ అయినా.. క్రీజులోకి మహమ్మద్ హారీస్‌తో రిజ్వాన్.. ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఇష్ సోదీ వేసిన 14వ ఓవర్ క్విక్ సింగిల్‌తో రిజ్వాన్ 36 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టీమ్ సౌథీ వేసిన 16వ ఓవర్‌లో మహమ్మద్ హారీస్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను సాంట్నర్ నేలపాలు చేశాడు. ట్రెంట్ బౌల్ట్ వేసిన 17వ ఓవర్ ఆఖరి బంతికి మహమ్మద్ రిజ్వాన్ క్యాచ్ ఔటవ్వగా.. పాక్ విజయానికి 18 బంతుల్లో 21 పరుగులు అవసరమయ్యాయి. ఫెర్గూసన్ వేసిన 18వ ఓవర్‌లో హారీస్.. సిక్స్, ఫోర్ కొట్టడంతో మ్యాచ్ పూర్తిగా పాక్ వైపు మళ్లింది. సాంట్నర్ వేసిన 19వ ఓవర్‌లో హారీస్ ఇచ్చిన క్యాచ్‌ను సోదీ నేలపాలు చేశాడు. అయితే ఈ ఓవర్ చివరి బంతికి హారీస్ క్యాచ్ ఔటవ్వగా.. చివరి ఓవర్ తొలి బంతిని సౌథీ వైడ్ వేయడంతో మ్యాచ్ టై అయ్యింది. ఆ తర్వాత షాన్ మసూద్ సింగిల్ తీసి విజయ లాంఛనం పూర్తి చేశాడు.

విశాలాంధ్ర గేమ్

బెంగళూరులో ఐపీఎల్ 2023 వేలం పాట?

మరికొద్ది రోజుల్లో బీసీసీఐ అధికారిక ప్రకటన

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2023లో తాజా అప్‌డేట్ బయటి కొచ్చింది. వచ్చే సంవత్సరం నిర్వహించబోయే ఐపీఎల్ సీజన్‌కు సంబంధించి బీసీసీఐ- వేలంపాట వేదికను నిర్ధారించింది. తేదీని కూడా ఫిక్స్ చేసింది. ఈ వేదికపై ఒకట్రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇదివరకు వార్తలొచ్చినట్లుగా ఈ వేలంపాటను నిర్వహించడానికి టర్కీ రాజధాని ఇస్తాంబుల్ దాకా వెళ్లట్లేదు బీసీసీఐ. స్వదేశంలోనే దీన్ని నిర్వహించనుంది. ఈ సీజన్ కోసం మెగా వేలంపాటను సిలికాన్ సిటీ బెంగళూరులో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈసారి ఇస్తాంబుల్‌తో పాటు హైదరాబాద్, బెంగళూరు,

కేరళలోని కోచి సిటీని కూడా షార్ట్ లిస్ట్ చేసింది. ఈ సీజన్ వేలంపాట కోసం తాజాగా కోచి నగరాన్ని ఎంపిక చేసింది. ఇస్తాంబుల్‌కు వెళ్లడం కుదరకపోతే రెండో ఆప్షన్‌గా బెంగళూరులోనే ఈ వేలంపాటను నిర్వహించే అవకాశాలు ఉన్నాయంటూ మొదట్లో వార్తలొచ్చాయి. దీనికి భిన్నంగా కోచిని సెలెక్ట్ చేసింది బీసీసీఐ. డిసెంబర్ 23వ తేదీన కేరళలోని కోచిలో ఐపీఎల్ మినీ వేలంపాటను నిర్వహించనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఐపీఎల్‌లో ఆడుతోన్న 10 ఫ్రాంచైజీల వద్ద 90 నుంచి 95 కోట్ల రూపాయల బ్యాలెన్స్ మిగిలివుంది. ఈ మొత్తంలో కొత్త ప్లేయర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.